

కపిలతీర్థం ఆలయం వద్ద ఓట్లు అభ్యర్థిస్తున్న ఆరణి శ్రీనివాసులు

'ఆరణి'తో అడ్జస్టవ్వాలా? వద్దా?

- కూటమి నాయకుల మల్లగుల్లాలు
- ఫోన్ మంతనాల్లో జనసేన అభ్యర్థి

తిరుపతి, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి తరపున తిరుపతి అసెంబ్లీ అభ్యర్థిగా ఎంపికైన చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులుతో సర్దుకు పోవాలా, లేదా అన్న మీమాంసలో కూటమి నేతలు ఉన్నారు.స్థానికులను కాదని చిత్తూరుకు చెందిన వ్యక్తిని తిరుపతి అభ్యర్థిగా తీసుకు రావడం టీడీపీ-జనసేన నాయకుల్లో అసమ్మతి కుంపటి రాజేసిన విషయం తెలిసిందే.అభ్యర్థికి సహకరించకపోతే తీవ్రమైన చర్యలు తీసుకుంటామంటూ ఇరు పార్టీల అధిష్ఠానాల నుంచి స్పష్టమైన ఆదేశాలు రావడంతో అసమ్మతి నేతలు కాస్త చల్లబడ్డట్టు తెలుస్తోంది. అయితే వైసీపీ అభ్యర్థిని ఓడించడమే ధ్యేయంగా పనిచేయాలంటే స్థానికత చాలా కీలకమన్న భావనలో ఉన్న బలిజ సామాజికవర్గానికి చెందిన ముగ్గురు నేతలు ఇప్పటికీ ఆరణితో మాట్లాడేందుకు అంగీకరించడంలేదు.ఈ క్రమంలో శుక్రవారం ఆరణి శ్రీనివాసులు తిరుపతికి వచ్చారు. అయితే టీడీపీ నుంచి కోడూరు బాలసుబ్రమణ్యం, జనసేన నుంచి పసుపులేటి హరిప్రసాద్ మాత్రమే ఆయన వెంట కనిపించారు. అక్కడినుంచి హోటల్‌కు చేరుకుని అసమ్మతి నాయకులతో ఫోన్లో మాట్లాడే ప్రయత్నం చేశారు.టీడీపీ నేతలు నరసింహ యాదవ్, బుల్లెట్ రమణ తదితరుల ఇళ్లకు వెళ్లినట్టు సమాచారం. మూడు పార్టీలు కలిసే తనను ఎంపిక చేశారని చెప్పుకొచ్చిన శ్రీనివాసులు ఇంతకాలం కష్టపడిన నాయకుల్లో అసంతృప్తి వుండడం సహజమేనని, అయితే త్వరలోనే అన్నీ సర్దుకుంటాయన్న ఆశాభావం వ్యక్తం చేశారు. తాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో జనసేన అభ్యర్థి శ్రీనివాసులుకు వైసీపీ అభ్యర్థి అభినయ్ రెడ్డి ఎదురుపడ్డారు.అభివాదం చేసుకుని బాగున్నారా అంటూ కరచాలనం చేసుకున్నారు.యాధృచ్ఛికంగా జరిగిన వీరి కలయిక వీడియో కూడా సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఆరణి వైసీపీ నాయకుడే కాబట్టి వచ్చీరాగానే ఆ పార్టీ అభ్యర్థితో మాటలు కలిపారన్న చర్చ నడిచింది.



మీడియా సమావేశంలో నగరి నేతల ప్లకార్డుల ప్రదర్శన

వెంకటగిరి, నగరిల్లో వైసీపీ వర్గపోరు

నేదురుమల్లి, రోజాలకు టికెట్టిస్తే పనిచేయమంటున్న జగన్ తమ్ముళ్లు

తిరుపతి, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): వెంకటగిరి, నగరి నియోజకవర్గాల అధికార పార్టీలో వర్గపోరు తారస్థాయికి చేరుకుంది. శనివారం ఈసీ ఎన్నికల షెడ్యూలును, వైసీపీ అధిష్ఠానం అభ్యర్థుల జాబితానూ విడుదల చేయనున్న నేపథ్యంలో ముందు రోజు జరిగిన పరిణామాలు పార్టీ వర్గాలను కలవరపాటుకు గురి చేశాయి. అసమ్మతి నేతల బలాన్ని పక్కన పెడితే ఎన్నికల ప్రారంభంలో ఇలాంటి ప్రచారం పార్టీ విజయావకాశాలను గణనీయంగా దెబ్బతీస్తుందని శ్రేణులు ఆందోళన చెందుతున్నాయి.వెంకటగిరి వైసీపీలో ఇటీవల సద్దుమణిగి నట్టు కనిపించిన అసమ్మతి శుక్రవారం ఒక్కసారిగా భగ్గుమంది. సిట్టింగ్ ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి వైసీపీకి దూరం కాగా ఆయన స్థానంలో నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి నియోజకవర్గ ఇంఛార్జిగా నియమితులయ్యారు. జిల్లా పార్టీ అధ్యక్ష పదవిని, రాష్ట్రస్థాయి కార్పొరేషన్ చైర్మన్ పదవులను దక్కించుకోవడంతో జిల్లాలో నేదురుమల్లికి సీఎం జగన్ ఎంత ప్రాధాన్యత ఇస్తున్నదీ తేటతెల్లమైంది.దీంతో నియోజకవర్గంలో బలపడాల్సిన రామ్‌కుమార్‌రెడ్డి దానికి భిన్నంగా సొంత పార్టీలోనే బలహీన పడ్డారు. ఆనం రామనారాయణరెడ్డి సన్నిహితులనే అనుమానంతో పలువురు పార్టీ నేతలను దూరం పెట్టారు. అందరినీ కలుపుకుపోవడంలో విఫలమయ్యారు. ప్రారంభంలో అసమ్మతి వర్గం ఆయనకు వ్యతిరేకంగా కార్యకలాపాలు సాగించినా రామ్‌కుమార్‌రెడ్డి తల్లి రాజ్యలక్ష్మి వారితో మాట్లాడి బుజ్జగించడంతో కొంతమేరకు సద్దుమణిగింది.దీంతో ఎన్నికలు సమీపించినందున అంతా సర్దుకుపోయి నట్టేనని అధిష్ఠానం భావించింది. అలాంటిది శుక్రవారం హఠాత్తుగా నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచీ ప్రజాబలం కలిగిన పలువురు నేతలు తమ అనుచర వర్గంతో రేణిగుంటలోని విమానాశ్రయం వద్దకు వెళ్ళి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని కలిశారు. నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ఇంఛార్జిగా నియమితులైన నాటి నుంచీ పార్టీలో అందరినీ కలుపుకుని వెళ్లడం లేదని ఆరోపించారు. ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని ఫిర్యాదు చేశారు. ఆయనకు టికెట్ ఇవ్వొద్దని డిమాండ్ చేశారు.రామ్‌కుమార్‌రెడ్డికి టికెట్ ఇస్తే ఆయన గెలుపు కోసం తాము పనిచేసేది లేదని కుండ బద్దలు కొట్టారు. కాదని ఎమ్మెల్యే టికెట్ ఇచ్చినా ఆయన ఓటమి ఖాయమని తేల్చి చెప్పారు. నియోజకవర్గంలోని ఆరు మండలాల నుంచీ కీలక నేతలు, వారి అనుచరులు మూకుమ్మడిగా రావడంతో పాటు రామ్‌కుమార్‌రెడ్డికి టికెట్ ఇస్తే పని చేసేది లేదంటూ నిర్మోహమాటంగా చెప్పడంతో మంత్రి పెద్దిరెడ్డి ఖంగు తిన్నారు. ఎన్నికల షెడ్యూలు వెలువడడానికి 24 గంటల సమయం కూడా లేని తరుణంలో వెంకటగిరిలో తలెత్తిన అసమ్మతి తీవ్రతను గుర్తించిన ఆయన తనకు ఒక రోజు సమయం ఇస్తే ఆలోపు అధిష్ఠానం దృష్టికి తీసుకెళతానని సర్దిచెప్పారు. ఒక రకంగా చెప్పాలంటే వెంకటగిరి వైసీపీ అసమ్మతి వర్గం బలప్రదర్శనకు శుక్రవారం విమానాశ్రయ ఆవరణ వేదికైంది. వెంకటగిరి నియోజకవర్గ వైసీపీ ముఖ్యనేత కలిమిలి రామ్‌ప్రసాద్‌రెడ్డి నేతృత్వంలో అసమ్మతి వర్గం మంత్రిని కలవగా ఆ బృందంలో వెంకటగిరి వైసీపీ టికెట్ రేసులో వున్న డీసీసీబీ మాజీ ఛైర్మన్ మెట్టుకూరు ధనంజయరెడ్డి సైతం వున్నారు. మంత్రిని కలసిన వారిలో వెంకటగిరి ఎంపీపీ తనూజ భర్త శివారెడ్డి, రాపూరు ఎంపీపీ ప్రసన్న, చెన్ను తిరుపాల్‌రెడ్డి, బాలాయపల్లి ఎంపీపీ వెందోడి భాస్కర్‌రెడ్డి, కలువాయి మండల నేత రాఘవరెడ్డి, సైదాపురం జడ్పీటీసీ, ఎంపీపీలు, ఆ మండల నేత నోటి రమణారెడ్డి, డక్కిలి వైస్ ఎంపీపీ గడ్డం సుధీర్‌రెడ్డి, ఆ మండల నేత మాధవరెడ్డిలతో పాటు వెంకటగిరి, రాపూరు మండలాలకు చెందిన 20మంది సర్పంచులు, వారి వర్గీయులు వున్నారు. ఎన్నికల షెడ్యూలుకు ముందురోజు సంభవించిన ఈ పరిణామం వెంకటగిరి నియోజకవర్గ అధికార పార్టీలో కలకలం సృష్టించింది.

అసమ్మతివర్గంలో రోజాపై వీడని వ్యతిరేకత

నగరి విషయానికొస్తే మంత్రి రోజాకు అసమ్మతి బెడద తగ్గడం లేదు సరికదా అంతకంతకూ పెరుగుతోంది. ఎంతోకాలంగా రోజాను వైసీపీలో పలువురు నేతలు వ్యతిరేకిస్తూ వస్తున్నా అధిష్ఠానం పట్టించుకున్న దాఖలాల్లేవు. ఎన్నికలు సమీపించేసినందున ఇక అసమ్మతి వర్గం సర్దుకుపోతుందని భావిస్తున్న తరుణంలో ఆ అంచనాలు తారుమారయ్యాయి. శుక్రవారం నియోజకవర్గానికి చెందిన పలువురు మండల స్థాయి నేతలు తిరుపతిలో మీడియా సమావేశం పెట్టి మరోసారి తమ డిమాండ్‌ను పునరుద్ఘాటించారు.రోజాకు టికెట్ ఇవ్వకూడదని అధిష్ఠానాన్ని వడమాలపేట జడ్పీటీసీ మురళీధర రెడ్డి కోరారు. తమ మాట కాదని టికెట్ ఇస్తే ఆమెను ఓడిస్తామని హెచ్చరించారు.ఈ విషయంలో అధిష్ఠానం మాట కూడా వినే పరిస్థితిలో లేమని అన్నారు. రోజా అక్రమాలు, వేధింపులపై పార్టీ నేతలంతా తీవ్ర అసంతృప్తితో ఉన్నారన్నారు. అసంతృప్త నేతలతో అధిష్ఠానం మాట్లాడి ఒప్పించిందని, ఇప్పుడు అంతా సవ్యంగా ఉందనే ప్రచారంలో ఏమాత్రం నిజం లేదన్నారు.ఎప్పటికీ ఆమెపై ఉన్న వ్యతిరేకత పోయే పరిస్థితి లేదన్న విషయాన్ని పార్టీ అధిష్ఠానం తెలుసుకొని ఇంకొకరికి సీటు ఇస్తే కష్టపడి గెలిపించుకుంటామన్నారు. అధికారంలోకి రాక ముందు రోజాకు ఉన్న అప్పులు, ఇప్పుడు ఉన్న ఆస్తులను పరిశీలిస్తే ఆమె ఏ స్థాయిలో అక్రమాలకు, అవినీతికి పాల్పడిందో తెలుస్తుందన్నారు.బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీపతిరాజు, ఎంపీటీసీ రవిశేఖర్‌రాజు, వైసీపీ నేతలు తులసీరాంరెడ్డి, భాస్కర్‌రెడ్డి, మునేంద్ర, వాసుదేవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జగనన్నా...సొమ్ములెక్కడ?

- బటన్లు నొక్కుతున్నా ఖాతాల్లో జమకాని నగదు
- ఎదురుచూస్తూనే వున్న రైతులు, మహిళలు



తుఫాన్ ప్రభావంతో ఎన్‌వీ కండ్రిగ సమీపంలో ఇసుక మేటలు, రాళ్లు చేరి దెబ్బతిన్న పంటపొలాలు

గత ఏడాది డిసెంబరులో తుఫాన్ ప్రభావంతో పంటలు దెబ్బతిన్న రైతులకు పెట్టుబడి రాయితీ సాయం విడుదల చేస్తూ సీఎం జగన్ వారం రోజుల కిందట బటన్ నొక్కినా అన్నదాతల ఖాతాల్లో ఇప్పటికీ నగదు జమకాలేదు. ఆసరా లబ్ధికి సంబంధించి సీఎం బటన్ నొక్కి 50 రోజులు పైబడినా నాలుగో విడత ఆసరా సొమ్ము మహిళల బ్యాంకు ఖాతాలకు ఇంకా జమకాలేదు.చేయూత కింద మహిళలకు అందజేసే సొమ్ము పరిస్థితి కూడా ఇదే.రోజూ బ్యాంకుల వద్దకు వెళుతున్న లబ్ధిదారులు ఖాతాలో సొమ్ము జమకాలేదని తెలిసి నిరాశగా వెనుదిరుగుతున్నారు.

సూళ్లూరుపేట, మార్చి 15: మిచౌంగ్ తుఫాన్ ప్రభావంతో సూళ్లూరుపేట నియోజకవర్గంలో అన్ని మండలాలతో పాటు గూడూరు, శ్రీకాళహస్తి నియోజకవర్గాల్లోని పలు మండలాల్లో దాదాపు 5 వేల హెక్టార్లలో వ్యవసాయ, ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయని అప్పట్లో ప్రాథమికంగా అధికారులు అంచనా వేశారు. తుది అంచనాల్లో పంట నష్ట విస్తీర్ణం సగానికి పైగా తగ్గింది. 50 రోజుల్లోపు పంట దెబ్బతిన్నా ఎలాంటి పరిహారం లేకుండా 80 శాతం రాయితీ విత్తనాలు అందజేసి చేతులెత్తేశారు. వాకాడు మండలంలో పంట నష్ట పరిశీలనకు వచ్చిన సీఎం జగన్ అన్నదాతలను అన్ని విధాలా ఆదుకుంటామని, పెట్టుబడి రాయితీ సొమ్మును సంక్రాంతి లోగా రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తామని గొప్పగా ప్రకటించారు. కానీ పంట నష్టపరిహారం చెల్లింపులో దాదాపు మూడు నెలల పైబడి జాప్యం జరిగింది. మూడు నియోజకవర్గాల్లో 4,076 మంది రైతులకు చెందిన దాదాపు 2,231 హెక్టార్ల పంట దెబ్బతింది. వీరికి హెక్టారుకు రూ.17 వేల చొప్పున రూ.3,79,18470 పరిహారం అందించేలా అధికారులు నివేదికలను తయారు చేసి ప్రభుత్వానికి పంపారు. అదే విధంగా 380 హెక్టార్లలో ఇసుక మేటలు వేసినట్టు గుర్తించి 1195 మంది రైతులకు హెక్టారుకు రూ.18 వేల చొప్పున రూ.68.49 లక్షల మేర పరిహారానికి అంచనా వేశారు. పలు మండలాల్లో పొలాల్లో ఉన్న సారవంతమైన మట్టికొట్టుకుపోయింది. 113 హెక్టార్లలో 369మంది బాధిత రైతులకు హెక్టారుకు రూ.47 వేల చొప్పున రూ.53.24లక్షలు అవసమని నివేదికలు సిద్ధం చేసి పంపి జాబితాలను కూడా ప్రకటించారు. నేటికీ వారి ఖాతాల్లో నగదు జమ కాలేదు.

ఆసరా, చేయూత సొమ్ములు కూడా అంతే..

మహిళా సంఘాలకు నాలుగో విడత ఆసరా లబ్ధికి జనవరి 23న అనంతపురం జిల్లా ఉరవకొండలో సీఎం జగన్ బటన్ నొక్కారు. అదే రోజు లబ్ధిదారులకు ఎక్కడికక్కడ స్థానికంగా నమూనా చెక్కులు అందజేశారు. ఆ చెక్కులు అందిన మరుసటి రోజు నుంచే మహిళల బ్యాంకు ఖాతాలకు నగదు జమవుతుందని అధికారులు చెప్పారు. 50 రోజులు దాటినా ఇప్పటికీ చాలామంది ఖాతాలకు నగదు జమకాలేదు. సూళ్లూరుపేటలోనే 827 పొదుపు సంఘాలుండగా 500సంఘాలకు మాత్రమే సొమ్ము జమైంది. ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల వారీగా ఖాతాలకు వేయడం వల్ల ఆలస్యమవుతోందని అధికారులు చెబుతున్నారు. 45 సంవత్సరాలు నిండిన మహిళలకు వైఎస్సార్ చేయూత కింద రూ.18,500 అందజేసేందుకు సీఎం బటన్ నొక్కి ఆయా మండలాల్లో ఎమ్మెల్యేల చేతుల మీదుగా ఆర్భాటంగా ఎన్నికల ప్రచార సభల్లా నిర్వహించి చెక్కులు పంపిణీ చేశారు.సూళ్లూరుపేటలోనే 2435మంది లబ్ధిదారులున్నారు. ఏ ఒక్కరికీ ఇప్పటిదాకా ఖాతాల్లో నగదు జమకాలేదు.

రైతు భరోసా సొమ్ము కూడా..

ఎన్నికల షెడ్యూల్ దగ్గర పడుతుండగా ఈ నెల 6న రైతుల ఖాతాల్లో పెట్టుబడి రాయితీ సొమ్మును జమచేస్తూ సీఎం జగన్ తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో బటన్ నొక్కారు. వారందాటినా అధికశాతం రైతుల ఖాతాల్లో రాయితీ సొమ్ము జమ కాలేదు. బ్యాంకుకు వెళ్లిన అన్నదాతలు ఇంకా సొమ్ము జమకాలేదని తెలిసి నిరాశగా వెనుదిరుగుతున్నారు. సున్నా వడ్డీ రాయితీ సొమ్ము సైతం విడుదల చేసినట్లుగా ప్రభుత్వం ప్రకటించింది. లబ్ధిదారుల జాబితాను ఆర్‌బీకేల్లో ప్రదర్శించారు. లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో ఇంకా రాయితీ సొమ్ము జమకాలేదు. కౌలు రైతులకు సైతం రూ.2 వేల సాయం అందిస్తామన్నారు. ఆ సాయం కూడా ఇంకా అందలేదు. వారు కూడా బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారు.



శ్రీకాళహస్తి, మార్చి 15: ముక్కంటి ఆలయ శివరాత్రి ఉత్సవాల్లో చివరి రోజైన శుక్రవారం రాత్రి జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామికి ఏకాంత సేవను వేడుకగా నిర్వహించారు.ఆలయం మూసే వేళ స్వామివారి

ఏకాంత సేవకు ఆదిదంపతులు

- ముగిసిన ముక్కంటి మహాశివరాత్రి ఉత్సవాలు



సన్నిధిలో చిన్న వెండి పల్లకిని ముస్తాబు చేసి మంగళవాయిద్యాలు, మేళతాళాలు, భక్తుల శివనామస్మరణ మధ్య స్వామి సన్నిధి నుంచి అమ్మవారికి పిలుపునిస్తూ జ్ఞానాంబిక సన్నిధికి తీసుకెళ్లగా అక్కడ అమ్మవారి ఉత్సవమూర్తి పల్లకిలో ఆశీనులయ్యారు. అక్కడినుంచి గురుదక్షిణామూర్తి సన్నిధి నుంచి ప్రదక్షిణపూర్వకంగా పల్లకి స్వామి సన్నిధిలో ఎదురుగా ధ్వజస్తంభం వద్దకు చేరుకుంది. అప్పటికే అక్కడ సిద్ధంగా ఉన్న శివయ్య ఉత్సవమూర్తి పల్లకిలో దేవేరికి ఎదురుగా ఆశీనులయ్యారు. ఆదిదంపతులు అధిరోహించిన పల్లకిని అమ్మవారి గర్భాలయంలోని శయన మందిరం వద్దకు తీసుకువచ్చారు. అక్కడ అమర్చిన పడక ఊయలలో స్వామి, అమ్మవార్లను కొలువుదీర్చి పూజలు నిర్వహించారు. వేదపండితులు, అర్చకులు, భక్తులు వెలుపలకు వచ్చి తలుపులు మూయడంతో ఏకాంతసేవ ముగిసింది.ఉత్సమూర్తులకు డ్రైఫ్రూట్స్ మాలలను, ప్రత్యేక సుగంధభరితమైన పూలమాలలను, పండ్లను భక్తులు సమర్పించారు. అర్చకులు పంపిణీ చేసిన ఏకాంత సేవ ప్రసాదాన్ని స్వీకరించారు.కాగా ఉత్సవాల ముగింపును పురస్కరించుకొని శుక్రవారం ఉదయం వేద పారాయణ సభ జరిగింది.రాష్ట్రవ్యాప్తంగా వివిధ దేవాలయాల నుంచి వచ్చిన 100మంది వేద పండితులు గురు దక్షిణామూర్తి సన్నిధిలో వేదాలను పఠించారు.

కాలువలు, చెరువులు కబ్జా కాకుండా చూడండి

వ్యవసాయ సలహామండలి సమావేశంలో కలెక్టర్



తిరుపతి(కలెక్టరేట్), మార్చి 15: కాలువలు, చెరువులు కబ్జాకు గురికాకుండా చూడాలని కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జరిగిన జిల్లా వ్యవసాయ సలహామండలి సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో కాలువలు, చెరువులు ఆక్రమణకు గురవుతున్నాయని, వాటిని ఆపగలిగితే పంటలను బాగా పండించవచ్చని తెలిపారు.చిట్టమూరు, వాకాడు, కోట, గూడూరు పరిధిలోని రైతులకు సాగునీటి సమస్య రాకుండా తెలుగుగంగ ద్వారా అందించే ఏర్పాట్లు చేశామని తెలిపారు.వ్యవసాయాధికారి ప్రసాదరావు మాట్లాడుతూ రబీలో 73,534 మంది రైతులకు 2,02,909 ఎకరాల్లో ఈ-క్రాప్ నమోదు పూర్తయిందన్నారు. మిచౌంగ్ తుపానుతో పంట నష్టపోయిన రైతులకు 80 శాతం సబ్సిడీపై విత్తనాలు సరఫరా చేసినట్లు తెలిపారు.జిల్లా ఉద్యానశాఖ అధికారి దశరథరామిరెడ్డి, జిల్లా సెరికల్చర్ అధికారి గీతారాణి, మైక్రో ఇరిగేషన్ శాఖ అధికారి సతీష్, వ్యవసాయ సలహామండలి సభ్యులు, అనుబంధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (శనివారం) : సా. 6.32

సహరి (ఆదివారం) : ఉ. 5.01





ఆయుధాలతో ఆలయం వద్ద ఎన్ఎస్‌జీ సిబ్బంది

ఉగ్రవాదులు దాడిచేస్తే....!

- శ్రీవారి ఆలయం వద్ద అర్ధరాత్రి ఎన్ఎస్‌జీ, ఆక్టోపస్ మాక్‌డ్రిల్

తిరుమల, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆలయం వద్ద నేషనల్ సెక్యూరిటీ గార్డ్స్, ఆక్టోపస్ బృందాలు మాక్‌డ్రిల్ నిర్వహించాయి. ఉగ్రవాదులు చొరబడినప్పుడు ఎలా ఎదుర్కోవాలి, భక్తులను ఎలా రక్షించాలి అనే అంశంపై గురువారం రాత్రి 12.30 గంటల తర్వాత ఆక్టోపస్ ఎస్పీ నాగేంద్రబాబు పర్యవేక్షణలో ఏఎస్పీ నగేష్‌బాబు ఆధ్వర్యంలో దాదాపు 140 మంది ఎన్ఎస్‌జీ సిబ్బంది, 40 మంది ఆక్టోపస్ సిబ్బంది ఆలయం వద్దకు చేరుకున్నారు. ఉగ్రవాదులు ఆలయంలోకి ప్రవేశించి తలుపులు మూసివేస్తే ఎలా ఎదుర్కోవాలనే అంశంపై డ్రిల్‌ను మొదలు పెట్టారు. ఏకాంత సేవ పూర్తిచేయగానే డ్రిల్‌ను ప్రారంభించారు. లైట్లను ఆపివేసి లిఫ్టర్ ద్వారా కొంతమంది, మహద్వారం నుంచి మరికొంతమంది భద్రతా సిబ్బంది ఆలయంలోకి ప్రవేశించారు. 30 నిమిషాల్లో డ్రిల్‌ను పూర్తిచేశారు. కాగా, ఆయుధాలతో అంత సంఖ్యలో భద్రతా సిబ్బందిని చూసిన సమీపంలోని భక్తులు ఏం జరుగుతోందో తెలియక కొంతసేపు ఆందోళనకు గురయ్యారు.



మిత్రపక్షాల మద్దతు కోరిన నాని

తిరుచానూరు, మార్చి 15: చంద్రగిరి నియోజకవర్గ టీడీపీ అభ్యర్థిగా పులివర్తి నానిని ప్రకటించిన ఈ నేపథ్యంలో శుక్రవారం ఆయన టీడీపీ నేతలతో పాటు మిత్రపక్షాలైన జనసేన, బీజేపీ నేతలను కలిసి మద్దతు అభ్యర్థించారు.ఎన్నికల్లో తన విజయానికి స హకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. టీడీపీ నేతలు నరసింహయాదవ్, మబ్బు దేవనారాయణరెడ్డి, సీఆర్ రాజన్, పులిగోరు మురళి, జేబీ శ్రీనివాస్,బీజేపీ నేత మేడసాని పురుషోత్తంనాయుడు, జనసేన ఇన్‌చార్జి దేవర మనోహర్, ఓబీసీ ఫోరం కన్వీనర్ బడి సుధాయాదవ్, డాలర్స్ దివాకర రెడ్డి, సురేంద్ర ఆస్పత్రి అధినేత డాక్టర్ సురేంద్ర తదితరులు ఆయన కలిసిన వారిలో వున్నారు.

ఎల్లమ్మకు వెండి కలశం బహూకరణ



చంద్రగిరి, మార్చి 15: చంద్రగిరిలోని మూలస్థాన ఎల్లమ్మ ఆలయానికి శుక్రవారం తిరుపతికి చెందిన కనుమూరి రాజేశ్వరి 529 గ్రాముల బరువు గల వెండి కలశాన్ని బహూకరించారు.ఆలయ చైర్మన్ యారాశి చంద్రశేఖర్‌రెడ్డికి కలశాన్ని అందజేశారు.

చేయూత చెక్కుల పంపిణీ

భాకరాపేట, మార్చి 15: చిన్నగొట్టిగల్లు ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి వైఎస్ఆర్ చేయూత చెక్కులను మహిళలకు పంపిణీ చేశారు. ఎంపీపీ యుగంధర్ రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ సహదేవరెడ్డి, జడ్పీటీసీ స్వరూప, వైస్ ఎంపీపీ దామోదర రెడ్డి, ఎంపీడీవో దేవేంద్రబాబు, ఈవోపీఆర్‌డీ సోమశేఖర రెడ్డి, సర్పంచు మనోహర, కార్యదర్శి మదనమోహన రాజు, ఏపీఎం కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

నేడు తలకోనలో మారు పొంగళ్ళ సిద్ధ పూజోత్సవం

ఎర్రావారిపాలెం, మార్చి15: తలకోనలో శనివారం మారు పొంగళ్ళ సిద్ధ పూజోత్సవం జరగనుంది. మహాశివరాత్రి ఉత్సవాల అనంతరం ఎనిమిది రోజులకు తలకోనలో మారుపొంగళ్ళ జాతర జరగడం ఆనవాయితీ. శివరాత్రి ఉత్సవాలకు రాలేకపోయిన భక్తులకు మరో అవకాశంగా మారు పొంగళ్ళ జాతర జరుగుతుంది. శుక్రవారం రాత్రి శివభక్తులు జాగరణ చేసి ఉదయం స్వామిని దర్శించుకుంటారు. మధ్యాహ్నం జరిగే మారు పొంగళ్ళ సిద్ధ పూజోత్సవంతో శివరాత్రి వార్షిక ఉత్సవాలు ముగియ నున్నాయి.

తలకోన అటవీ ప్రాంతంలో ఆరని మంటలు

ఎర్రావారిపాలెం, మార్చి 15 : రెండు రోజులుగా శేషాచలం అటవీ ప్రాంతంలోని తలకోన సౌత్ బీట్ కాలి బూడిదవుతోంది. మంటలను ఆర్పక పోవడంతో మరింత వ్యాపిస్తున్నాయి.తలకోన పేటుకు దాదాపు 20 కిలోమీటర్ల వరకు మంటలు రాత్రివేళ కనపడుతున్నాయి. ఇరవై ముప్పై అడుగుల ఎత్తు వరకు మంటలు ఎగిసి పడుతున్న అగ్ని కీలలు సమీప అటవీ సరిహద్దు గ్రామాలకు కనపడుతున్నాయి.

4,430 కిలోల రేషన్‌బియ్యం స్వాధీనం

ఏర్పేడు, మార్చి 15: ఆటోలో రేషన్‌బియ్యం తరలిస్తున్న ఇద్దరిని సివిల్ సప్లైస్ అధికారులు శుక్రవారం పట్టుకున్నారు. వారి నుంచి 4,430 కిలోల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఆమందూరు గ్రామానికి చెందిన చంటి, రేణిగుంట మండలం దొడ్లమిట్టకు చెందిన రామాంజనేయులుపై పోలీసులు కేసు నమోదు చేశారు.

పొలానికి వెళ్లిన వ్యక్తి అదృశ్యం



గురవారెడ్డి

రామచంద్రాపురం, మార్చి 15: మండలంలోని నడవలూరు గ్రామానికి చెందిన గురవారెడ్డి కనిపించడం లేదని కుటుంబ సభ్యులు స్థానిక పోలీసులకు ఫిర్యాదుచేశారు. ఫిర్యాదులో తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన గురవారెడ్డి ఈ నెల9న పొలం వద్దకు వెళ్లాడు. సాయంత్రం వరకు తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు తమ బంధువుల ఇళ్ల వద్ద వెతికారు. ఫలితం లేకపోవడంతో గురువారం పోలీసులకు ఫిర్యాదుచేశారు. గురవారెడ్డి లేత పసుపు రంగుషర్టు, నలుపు రంగు పంచె, పచ్చ టవలు ధరించి ఉన్నాడు. ఆచూకీ తెలిసినవారు. ఎస్‌ఐ ఫోన్‌నెంబర్ 9440796731కు తెలపాలని కోరారు.

తిరుచ్చిపై అమ్మవారి అభయం

తిరుచానూరు, మార్చి 15: తిరుచానూరులో కొలువైన పద్మావతి అమ్మవారు శుక్రవారం బంగారు తిరుచ్చిపై మాడవీధుల్లో ఊరేగారు.ఉదయం కల్యాణోత్సవం, లక్ష్మీపూజ వేడుకగా జరిగింది.డిప్యూటీ ఈవో గోవిందరాజన్, ఏఈవో రమేష్, సూపరింటెండెంట్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మామిడిలో తేలికపాటి తడులు ఇవ్వండి

రామచంద్రాపురం, మార్చి 15: మామిడిలో తేలికపాటి నీటి తడులను ఇవ్వాలని ఉద్యానశాఖ అధికారి సునీల్ తెలిపారు. శుక్రవారం మిట్టకండ్రిగలోని మామిడితోటలను ఆయన పరిశీలించారు. రైతులకు ప్రస్తుత పరిస్థితిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. మండలంలో దాదాపు 4వేల ఎకరాల్లో మామిడి సాగులో ఉందన్నారు. కానీ కేవలం 25నుంచి 30 శాతం వరకు తోటల్లో మాత్రమే పూత వచ్చిందన్నారు. తేలికపాటి తడులు ఇవ్వడం వలన పూత వచ్చే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో రైతు భరోసా కేంద్రం అధికారులు డిల్లీరాణి, కీర్తన, రైతులు పాల్గొన్నారు.

అమ్మవారి సేవలో హైకోర్టు న్యాయమూర్తి



ఆలయం వద్ద జస్టిస్ బి.శ్యామ్‌సుందర్

తిరుచానూరు, మార్చి 15: తిరుచానూరులో కొలువైన పద్మావతి అమ్మవారిని శుక్రవారం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.శ్యామ్‌సుందర్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు.

జగనన్న ఇళ్లస్థలాల రిజిస్ట్రేషన్ పత్రాల పంపిణీ



ఇళ్ల రిజిస్ట్రేషన్ పత్రాలను పంపిణీ చేస్తున్న మోహిత్‌రెడ్డి

తిరుపతి(రూరల్),మార్చి15: తిరుపతి రూరల్ మండల పరిధిలోని లబ్ధిదారులకు శుక్రవారం ఇళ్లస్థలాల రిజిస్ట్రేషన్ పత్రాలను తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి పంపిణీ చేశారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో 11,711 మందికి రిజిస్ట్రేషన్ పత్రాలను అందించారు. ఎంపీపీ యశోద, వైస్ ఎంపీపీ విడుదల మాధవ రెడ్డి, సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు, వార్డు మెంబర్లు పాల్గొన్నారు.

సైనిక్ స్కూల్‌కు నేహప్రియ ఎంపిక



భాకరాపేట, మార్చి 15: భాకరాపేట గీతాంజలి ఉన్నత పాఠశాలలో చదువుతున్న నేహప్రియ సైనిక్ స్కూల్‌కు ఎంపికైనట్లు కరస్పాండెంట్ గిరి కుమార్ రెడ్డి తెలిపారు. ఆల్ ఇండియా సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్షలో 300 మార్కులకు గాను 256 మార్కులు సాధించి సైనిక్ స్కూలు ఎంపికైనట్లు ఆయన తెలిపారు. నేహప్రియను కరస్పాండెంట్, హెచ్‌ఎం స్వాతి, ఉపాధ్యాయులు అభినందించారు.

చంద్రగిరిలో పోలీసు కవాతు

చంద్రగిరి, మార్చి 15: ప్రత్యేక బలగాలతోపాటు చంద్రగిరి పోలీసులు శుక్రవారం జాతీయ రహదారి నుంచి పట్టణ వీధుల్లో కవాతు నిర్వహించారు. సీఐ రామయ్య మాట్లాడుతూ ఓటర్లు నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చర్యలు తీసుకొంటామన్నారు. కవాతులో ఎస్‌ఐలు అనిత, రవీంద్రనాథ్, సిబ్బంది పాల్గొన్నారు.



చంద్రగిరి

డ్రైనేజీలో పడి గాయపడ్డ జింక

చంద్రగిరి, మార్చి 15: తొండవాడ పంచాయతీ అరుణకాలనీ సమీపంలో రోడ్డు పక్కనున్న డ్రైనేజీలో ఓ జింక పడి తీవ్రంగా గాయపడింది. గురువారం రాత్రి తాగు నీటి కోసమని అటవీ ప్రాంతం నుంచి చంద్రగిరి పట్టణంలోకి వచ్చింది. అరుణ కాలనీ సమీపంలో డ్రైనేజీ వద్దకు వెళ్లి ప్రమాదవశాత్తు పడిపోయింది. శుక్రవారం ఉదయం స్థానికులు గమనించి గాయపడిన జింకను జూపార్క్ సిబ్బందికి అప్పగించారు.



రూ.25కోట్ల తుడా భూమికి టెండర్





- మాస్టర్‌ప్లాన్ వేసిన వైసీపీ నేతలు
- త్వరలో నిర్మాణాలకు వ్యూహ రచన

మంగళం, మార్చి 15: నాలుగున్నర సంవత్సరాల్లో ప్రైవేటు భూములు కబ్జా చేసి అలసిపోయిన అధికార పార్టీ నేతలు ఇప్పుడు ఏకంగా తుడా భూములకే టెండరు వేశారు. తిరుపతి కరకంబాడి ప్రధాన రహదారిలో మంగళం వద్ద దాదాపు రూ.25కోట్లు విలువ చేసే ఈ భూమి కబ్జాకు మాస్టర్‌ప్లాన్ వేశారు. ఎన్నికల కోడ్ వచ్చేలోగా నిర్మాణాలు కూడా చేపట్టాలని వ్యూహరచనతో ముందుకెళుతున్నారు. మంగళం, శెట్టిపల్లి, చెన్నాయగుంట ప్రాంతాల్లో ప్రభుత్వ భూములను కాజేసిన నేతలు తాజాగా మంగళం వద్ద ఉన్న రెండు ఎకరాల తుడా భూమిని కబ్జా చేయడానికి సిద్ధమైపోయారు. ఈ స్థలంలో గతంలో ఒక ఆలయం ఉండేది. తుడాకు సంబంధించిన కుండీలను డంప్ చేసి ఉంచారు. కుండీలను పక్కకు జరిపేశారు. చిన్నదిగా ఉన్న వినాయక ఆలయాన్ని పక్కన పెట్టేశారు. స్థలాన్ని చదును చేసి, నిర్మాణాలకు అన్ని ఏర్పాట్లు చేసుకుంటున్నా తుడా అధికారులు స్పందించకపోవడంపై స్థానికులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. తుడాలోని ఓ నేత సూచనలతోనే అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

ఇకనుంచి గ్రామ కంఠంగా ఎస్వీ నగర్

- నిషేధిత జాబితా నుంచి తొలగిస్తూ ఉత్తర్వులు

తిరుపతి రూరల్, మార్చి 15: తిరుపతి రూరల్ మండలం పెరుమాళ్లపల్లె పంచాయతీ పరిధిలోని ఎస్వీ నగర్‌ను నిషేధ జాబితా నుంచి తొలగించి గ్రామ కంఠంగా మార్పుచేస్తూకలెక్టర్ లక్ష్మీశ శుక్రవారం ఉత్తర్వులు వెలువరించారు. నలభై ఏళ్ల నాటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతూ రిజిస్ట్రేషన్‌కు అవకాశం కల్పించారు. సర్వే నంబర్ 534 తోపు పోరంబోకు స్థలాన్ని నిషేధిత 22(ఎ) జాబితా నుంచి గ్రామకంఠంగా మార్పుచేస్తూ 5.26 ఎకరాల్లో ఏర్పాటైన నివాసాలకు రిజిస్ట్రేషన్ చేసుకునే వెసులుబాటు కల్పించారు. ఈ క్రమంలో కలెక్టర్ జారీచేసిన ప్రొసీడింగ్స్ కాపీలు, ఇంటి హక్కు పత్రాలను తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి గ్రామస్తులకు అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ... ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి చొరవచూపి ఎన్నో ఏళ్లనాటి తమ కలను సాకారం చేశారని కృతజ్ఞతలు తెలిపారు.

అటు ధైర్యం...ఇటు చైతన్యం

కేంద్ర సాయుధ బలగాలతో పోలీస్ కవాతు



తిరుపతి(నేరవిభాగం), మార్చి 15 : సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో పోలీసులు ప్రజలకు మనోధైర్యం కల్పిస్తున్నారు. తిరుపతి జిల్లా అంతటా కేంద్ర సాయుధ బలగాలతో కవాతు నిర్వహిస్తున్నారు. శుక్రవారం చంద్రగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలో సీఐ రామయ్య ఆధ్వర్యంలో తొండవాడ గ్రామం నుంచి టవర్ క్లాక్ సర్కిల్, నూర్ జంక్షన్ వరకు, రామచంద్రాపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో ఎస్‌ఐ చిరంజీవి ఆధ్వర్యంలో కాళేపల్లి, ఎన్.ఆర్.కమ్మపల్లి, నెత్తకుప్పం, అలిపిరి పోలీస్‌స్టేషన్ పరిధిలో తిరుపతి డీఎస్పీ సురేంద్రరెడ్డి, సీఐ రామచంద్రారెడ్డి, ఎస్‌ఐలు రామస్వామి, రాజశేఖర్ ఆధ్వర్యంలో తిమ్మినాయుడుపాళ్యం, ఆటోనగర్, రాజీవ్‌గాంధీ కాలనీ, ఉప్పరపాళ్యం, శెట్టిపల్లి ప్రాంతాల్లో కవాతు నిర్వహించారు. సమస్యాత్మక, అతి సమస్యాత్మక ప్రాంతాలను గుర్తిస్తున్నారు.

క్రాంతిపథం ఏరియా కోఆర్డినేటర్‌కు రివర్షన్

కోట, మార్చి 15: వైఎస్సార్ క్రాంతిపథం ఏరియా కోఆర్డినేటర్‌గా పనిచేస్తున్న డాక్టర్ చంద్రబాబుకు రివర్షన్ ఇచ్చారు. ఈ మేరకు డీఆర్‌డీఏ పీడీ జ్యోతి అధికారికంగా శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు. చంద్రబాబు ఐదు నెలలుగా గూడూరు, చిల్లకూరు, కోట, వాకాడు, చిట్టమూరు మండలాల వైఎస్సార్ క్రాంతిపథం ఏరియా కోఆర్డినేటర్‌గా వ్యవహరిస్తున్నారు. ఈయనపై వచ్చిన పలు ఆరోపణల నేపథ్యంలో తిరిగి ఆయనను తిరుపతిలోని డీఆర్‌డీఏ ఆఫీసుకు పిలిపించి అక్కడే పోస్టింగ్ ఇవ్వనున్నట్లు అధికార వర్గాలు తెలిపారు.

మెమో రైలులో సాంకేతిక లోపం

డీవీసత్రంలో రెండు గంటల పాటు నిలిపివేత

దొరవారిసత్రం, మార్చి 15: నెల్లూరు - చెన్నై మధ్య నడిచే మెమో రైలులో శుక్రవారం సాంకేతిక లోపం ఏర్పడింది. ఉదయం 10.20 గంటలకు నెల్లూరు నుంచి చెన్నై బయలుదేరిన మెమో రైలు 12 గంటల ప్రాంతంలో దొరవారిసత్రం రైల్వేస్టేషన్ సమీపానికి చేరుకొంది. ఆ సమయంలో రైలులో ఇంజన్‌కు పవర్ అందించే ఓహెచ్‌సీ స్టాండ్ విరిగిపోయింది. గుర్తించిన లోకో పైలెట్ దొరవారిసత్రం రైల్వేస్టేషన్‌లో లూప్‌లైన్‌లో రైలును ఆపేశారు. సుమారు రెండు గంటల పాటు శ్రమించిన సిబ్బంది విరిగిపోయిన స్టాండ్‌ను సరిచేశారు. అనంతరం రైలు చెన్నైకు బయలుదేరి వెళ్లింది. రెండు గంటల సేపు రైలు ఆగిపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు.

ఎస్సీవీ ఇంట నేడు అసమ్మతి సమావేశం?

- హాజరుకానున్న రెండు నియోజకవర్గాల నేతలు

శ్రీకాళహస్తి, మార్చి 15: తెలుగుదేశం నాయకుడు ఎస్సీవీ ఇంటివద్ద శనివారం ఉదయం సమావేశం అవుదామంటూ ఒక సమాచారం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. శ్రీకాళహస్తి టీడీపీ అభ్యర్థిగా బొజ్జల సుధీర్‌రెడ్డిని ప్రకటించిన నేపథ్యంలో సత్యవేడు, శ్రీకాళహస్తి నియోజకవర్గాల్లోని కొందరు నాయకులు ఈ సమావేశానికి హాజరవుతున్నట్టు చెబుతున్నారు. ఇదే సమయంలో ఎస్సీవీ నాయుడుకు కాంగ్రెస్ పార్టీలో చేరమంటూ ఆహ్వానం వచ్చినట్టు తెలుస్తోంది. గతంలో చింతామోహన్‌కి సన్నిహితుడైన ఈయనను చింతాతో పాటూ షర్మిల కూడా ఆహ్వానించారని ప్రచారం జరుగుతోంది. శుక్రవారం కొందరు అనుచరులను సంప్రదించిన ఎస్సీవీ శనివారం మరింత మందితో సమావేశం అవుతున్నారని చెబుతున్నారు. శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే సత్రవాడ ముని రామయ్య, సత్యవేడు మాజీ ఎమ్మెల్యే హేమలత, ఆమె కుమార్తె హెలెన్‌లను ఈ సమావేశానికి ఆహ్వానించినట్టు సోషల్ మీడియాలో పేర్కొ న్నారు. తెలుగుదేశం అభ్యర్థుల పట్ల అసంతృప్తితో ఉన్న వీరు నేడు ఎటువంటి నిర్ణయం తీసుకుంటారో అనే ఆసక్తి అందరిలో ఉంది.

పేదలకు నాణ్యమైన వైద్యం అందించాలి



వైద్య సేవల గురించి వివరిస్తున్న మెడికల్ ఆఫీసర్ శ్రీధర్

భాకరాపేట, మార్చి 15: ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే పేదలకు నాణ్యమైన వైద్యం అందించాలని ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ యుగంధర్ రెడ్డి అన్నారు. చిన్నగొట్టిగల్లు సామాజిక ఆరోగ్య కేంద్రం అభివృద్ధి కమిటీ సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా రోగులకు అందిస్తున్న వైద్య సేవలను మెడికల్ ఆఫీసర్ శ్రీధర్ వివరించారు. అలాగే రోగులకు సౌకర్యాలు, వైద్య పరికరాలు, అత్యవసర మందులు, ఫర్నీచర్, సెక్యూరిటీ, శ్యానిటేషన్ సిబ్బందిని పెంచడానికి అనుమతులు కోరుతూ తీర్మానాలు చేశారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ సహదేవ రెడ్డి, కమిటీ సభ్యులు అక్బర్, ఆదినారాయణ రెడ్డి, సుబ్రహ్మణ్యం, సర్పంచ్ మనోహర్, వైద్యులు షీలాబాను, పుష్ప, సిబ్బంది గిరి, శ్రీనివాస్, కమలమ్మ, దినేశ్ తదితరులు పాల్గొన్నారు.

12 కేజీల గంజాయి స్వాధీనం



స్వాధీనం చేసుకున్న గంజాయి, నిందితుడితో సెబ్ అధికారులు

తిరుపతి (నేరవిభాగం), మార్చి 15 : రేణిగుంటలో పోలీసులు, సెబ్ అధికారులు దాడులు చేసి 12 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. రహస్య సమాచారం మేరకు పోలీసులు, సెబ్ అధికారులు శుక్రవారం ఉమ్మడిగా దాడులు నిర్వహించారు. తమిళనాడు రాష్ట్రం కడలూరు జిల్లాకు చెందిన శివ ప్రకాశంను అరెస్టు చేశారు. అతని నుంచి 12 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. గంజాయి సరఫరా చేసిన ఒడిశా రాష్ట్రానికి చెందిన జితేందర్, కన్యాకుమారికి చెందిన రాజేష్‌పై కేసు నమోదు చేసినట్లు సెబ్ సీఐ భీమలింగం చెప్పారు. ఈ దాడుల్లో ఎస్‌ఐ అశోక్‌కుమార్, హెడ్ కానిస్టేబుల్ రవి, చిరంజీవి, మహేష్, అశోక్‌కుమార్ పాల్గొన్నారు.



ఇందుశేఖర్ దంపతులకు కమ్మ సంఘ ప్రతినిధుల సత్కారం

కమ్మ భవన్ నిర్మాణానికి ఇందుశేఖర్ భారీ విరాళం

తిరుపతి (కొర్లగుంట), మార్చి 15 : తిరుపతి సమీపంలోని వకుళ మాత ఆలయం దగ్గర తిరుపతి కమ్మ అభ్యుదయ సంక్షేమ సంఘం నిర్మించ తలపెట్టిన అంతర్జాతీయ కమ్మ భవనం నిర్మాణానికి చంద్రగిరి టీడీపీ నేత కొల్లూరి ఇందుశేఖర్ రూ. కోటిన్నర విరాళం ప్రకటించారు. తన తాత, చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే మేడసాని వెంకటరామానాయుడు అలియాస్ మీసాల నాయుడు పేరిట రూ. కోటితో కన్వెన్షన్ హాలు, తన తండ్రి కొల్లూరి మోహన్ నాయుడు పేరిట రూ. 50 లక్షలతో భోజనశాల నిర్మించాలని ఆయన సంఘ నిర్వాహకులను కోరారు. అంతర్జాతీయ కమ్మ భవన నిర్మాణానికి భారీ విరాళం ప్రకటించిన నేపథ్యంలో శుక్రవారం కమ్మ సంఘం అధ్యక్షుడు పులిపాటి పురంధరనాయుడు, ఆర్గనైజింగ్ కార్యదర్శి వేమూరి జయరాం ప్రసాద్, ఉపాధ్యక్షుడు రామచంద్ర నాయుడు, సభ్యుడు లీలాకృష్ణమ నాయుడు తదితరులు కొల్లూరు ఇందుశేఖర్ దంపతులను వారి నివాసంలో ఘనంగా సత్కరించారు.

ఇంటిని ఆక్రమించుకున్నారు..

ఎమ్మార్‌పల్లి పోలీసులకు మహిళ ఫిర్యాదు



ఇంటిని పరిశీలిస్తున్న పోలీసులు - పోలీసులకు ఫిర్యాదు చేసిన శ్రీదేవి

తిరుపతి క్రైం, మార్చి 15 : తాము నివాసముంటున్న ఇంటిని దౌర్జన్యంగా ఆక్రమించుకున్నారని శుక్రవారం ఒక మహిళ ఎమ్మార్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. బాధితురాలు ఫిర్యాదు మేరకు...శ్రీనివాసపురానికి చెందిన శ్రీదేవి తన సొంత ఇంట్లో కాపురముంటున్నారు. ఆ ఇల్లు వివాదంలో ఉన్న విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే అనుచరుడు పరిష్కరిస్తామని చెప్పి తన స్నేహితుడు ప్రదీప్ పేరుతో రిజిస్ట్రేషన్ చేయించాడు. అదే ఇంటిని ప్రదీప్ రూ.2.5 కోట్లకు మురళీరెడ్డికి విక్రయించాడు. మురళీరెడ్డి, అతని అనుచరులు శుక్రవారం ఇంటిని ఖాళీ చేయాలని శ్రీదేవిని కోరారు. తమ ఇంటిని ఖాళీ చేయడం ఏమిటని ఆమె ప్రశ్నిస్తున్నా వినకుండా దౌర్జన్యంగా బయటకు లాగి, ఇంట్లో వస్తువులను బయటకు విసిరేశారు. ఆమె సీపీఐ నగర కార్యదర్శి విశ్వనాథం ఆధ్వర్యంలో ఎమ్మార్‌పల్లి పోలీస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి, విచారిస్తున్నారు. ఇంట్లో రూ.లక్ష నగదు, 20సవర్ల బంగారు నగలు కనిపించడం లేదని ఆమె తన ఫిర్యాదులో పేర్కొన్నారు.

నారాయణలో ఆకట్టుకున్న సైన్స్‌క్విజ్



తిరుపతి(విద్య), మార్చి15: టాటానగర్‌లోని నారాయణ స్కూల్‌లో శుక్రవారం విద్యార్థులకు నిర్వహించిన సైన్స్‌క్విజ్ పోటీలు ఆకట్టుకున్నాయి. ఈ పోటీలలో జిల్లావ్యాప్తంగా ఉన్న నారాయణ విద్యాసంస్థల నుంచి 55మంది విద్యార్థులు పాల్గొని శాస్త్ర, సాంకేతిరంగాలకు సంబంధించిన పలు ప్రశ్నలకు సమాధానాలు చెప్పి అబ్బురపరిచారని ప్రిన్సిపాల్ సి.రవికాంత్‌గుప్తా పేర్కొన్నారు. ప్రతిభచాటిన విద్యార్థులకు ముఖ్యఅతిథులుగా వచ్చిన ఏజీఎం కిశోర్‌కుమార్, ఆర్‌ఐ వసంత్‌కుమార్ చేతులమీదుగా బహుమతులు అందించారు.

టెన్త్ విద్యార్థులకు రైటింగ్ ప్యాడ్ల పంపిణీ



తిరుపతి(విద్య), మార్చి 15: ఆర్‌ఎస్‌మాడ వీధిలోని నగరపాలక ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు నందనం అకాడమీ ఆధ్వర్యంలో శుక్రవారం రైటింగ్ ప్యాడ్లు, పెన్నులు పంపిణీ చేశారు. సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ పత్తిపాటి వివేక్ మాట్లాడుతూ విద్యార్థులు ఒత్తిడికి లోనుకాకుండా పరీక్షలు రాసి, మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. అకాడమీ గౌరవాధ్యక్షుడు డాక్టర్ పాకనాటి హరికృష్ణయాదవ్, హెచ్‌ఎం రేవతి, పట్నాలువీధి నగరపాలక ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం భీమినేని మునికృష్ణనాయుడు పాల్గొన్నారు.

టీడీపీలోకి జ్ఞానకుమార్



తిరుపతి, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ యువ దళిత నేత జ్ఞాన కుమార్ టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. శుక్రవారం ఉండవల్లిలోని చంద్రబాబును కలిసి పార్టీ కండువా కప్పుకున్నారు. తిరుపతికి చెందిన ఇతను సుదీర్ఘకాలం టీడీపీ 17వ డివిజన్ నాయకుడిగా ఉన్నారు. 2014 ఎన్నికల ముందు వైసీపీలోకి వెళ్లారు. నామినేటెడ్ పదవి కోసం తీవ్ర ప్రయత్నం చేసి నిరాశచెందారు. ఈ క్రమంలో సత్యవేడు టీడీపీ అభ్యర్థిగా విస్తృత ప్రయత్నాలు చేసి, విఫలమయ్యారు. ఈ నేపథ్యంలో చంద్రబాబును కలిసి పార్టీలో చేరారు. సత్యవేడు అభ్యర్థి విజయం కోసం కష్టపడాలని, భవిష్యత్తులో న్యాయం చేస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారని కుమార్ వెల్లడించారు. దళితులకు వైసీపీలో సముచిత గౌరవం లేదని, టీడీపీతోనే ఆత్మగౌరవం ఉందని నమ్మి తిరిగి వచ్చానని చెప్పారు.

ముగిసిన ఇంటర్ పరీక్షలు

- సంబరాలు జరుపుకున్న విద్యార్థులు



తిరుపతి(విద్య), మార్చి 15: ఇంటర్మీడియట్ జనరల్ విభాగ పబ్లిక్ పరీక్షలు శుక్రవారంతో ముగిశాయి. ఈనెల 1వ తేదీన ప్రారంభమైన పరీక్షలు శుక్రవారం వరకు సాగాయి. చివరి రోజు జరిగిన ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలకు జిల్లాలో 136 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఆర్‌ఐఓ జీవీ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. జనరల్, ఒకేషనల్ విభాగాల్లో 28,060 మంది విద్యార్థులకుగాను 27,217 మంది పరీక్షలకు హాజరయ్యారని వెల్లడించారు. జనరల్ విభాగంలో 27,123 మంది విద్యార్థులకుగాను 26,416 మంది, ఒకేషనల్ విభాగంలో 937 మందికి గాను 801 మంది పరీక్షలు రాసినట్లు చెప్పారు. పరీక్షలు పూర్తి కావడంతో విద్యార్థులు సంబరాలు చేసుకున్నారు. చివరి పరీక్ష తర్వాత కేంద్రాల నుంచి బయటకు వచ్చిన విద్యార్థులు తోటి స్నేహితులతో ఆనందాన్ని పంచుకున్నారు. కేరింతలు కొడుతూ ఒకరికొకరు అభినందనలు తెలియజేసుకున్నారు. బస్సుల్లో వెళ్తున్న విద్యార్థులు చుట్టుపక్కల వారికి టాటాలు చెబుతూ సంబరపడ్డారు. కాగితాలు ముక్కలు చింపి గాలిలో విసిరేస్తూ ఆనందాన్ని ప్రకటించారు.

19న ముగియనున్న రీసెట్ దరఖాస్తు గడువు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 15: రాష్ట్రంలోని యూనివర్సిటీల్లో ఖాళీగా ఉన్న పీహెచ్‌డీ సీట్ల భర్తీకి చేపట్టే ఏపీ రీసెట్ 2023-24 దరఖాస్తు గడువు ఈనెల 19వ తేదీతో ముగియనుంది. ఆసక్తి గల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఏపీ రీసెట్ కన్వీనర్ ప్రొఫెసర్ దేవప్రసాదరాజు కోరారు.

ఇంటి స్థలాలు ఇవ్వకపోతే ప్రభుత్వ భూములు ఆక్రమిస్తాం

తిరుపతి (కలెక్టరేట్), మార్చి 15: పేదలకు ఇంటి స్థలాలు, ఇళ్లు మంజూరు చేయకపోతే ప్రభుత్వ భూములను ఆక్రమిస్తామని సీపీఐ ఎంఎల్ లిబరేషన్ ఆధ్వర్యంలో మహిళలు కలెక్టరేట్ వద్ద శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా కార్యదర్శి సత్తార్ మాట్లాడుతూ ఎన్నోసార్లు కలెక్టర్‌ను, అధికారులను, ఎమ్మెల్యేను కలిసి విన్నవించినా పట్టించుకోలేదన్నారు. న్యాయం చేసే వరకు ఆందోళన చేస్తూనే ఉంటామని స్పష్టం చేశారు. కలెక్టర్ లక్ష్మీశా అక్కడికి చేరుకుని న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. ఈ కార్యక్రమంలో బాలకృష్ణ, సుజాత, లక్ష్మి, మలార్, రేవతి, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల సామగ్రి పరిశీలన



ఓటింగ్ సామగ్రిని పరిశీలిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

తిరుపతి (కలెక్టరేట్), మార్చి 15 : కలెక్టరేట్‌కు శు క్రవారం చేరుకున్న ఎన్నికల సామగ్రిని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి లక్ష్మీశ పరిశీలించారు. ప్రిసైడింగ్ అధికారి, ఆర్వో హ్యాండ్‌బుక్ తదితరాలను ఎస్సీసీ మురళితో కలిసి పరిశీలించారు. ఎన్నికల సెక్షన్ సిబ్బంది పాల్గొన్నారు.

రేడియో సిటీ 91.1ఎఫ్ఎం వారు హైదరాబాద్‌లో నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ ఐకాన్ అవార్డ్స్ కార్యక్రమంలో తిరుపతికి చెందిన ఎస్ఆర్ ఇండియా ప్రైమ్ ప్రాపర్టీస్ సంస్థ అవార్డు గెలుచుకుంది. ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్స్ రాజశేఖరరెడ్డి, సుబ్రమణ్యంరెడ్డి ఈ అవార్డు అందుకున్నారు.



కత్తులతో బెదిరించి..
రిటైర్డ్ ఎస్ఐ ఇంట్లో దోపిడి



→ బీరువాలోని వస్తువులు చిందరవందరగా పడేసిన దృశ్యం

తిరుపతి క్రైం, మార్చి 15 : ఎమ్మార్‌పల్లి సర్కిల్ సమీపంలోని శ్రీనగర్ కాలనీలో శుక్రవారం తెల్లవారుజామున దుండగులు రెచ్చిపోయారు. రిటైర్డ్ ఎస్‌ఐ ప్రకాష్ ఇంట్లో చోరీకి పాల్పడ్డారు. 15 సవర్ల బంగారు, 5 కేజీల వెండి వస్తువులు అపహరించుకెళ్లారు. పోలీసుల వివరాల మేరకు.. ప్రకాష్ పోలీసు శాఖలో ఎస్‌ఐగా పనిచేసి రిటైర్డ్ అయ్యారు. ఆయన ఇటీవల మృతి చెందారు. భార్య తిలకవతి ఇంట్లో ఒంటరిగా నిద్రిస్తుండగా తెల్లవారుజామున దుండగులు చొరబడ్డారు. బెడ్‌రూం తాళాలను రాడ్‌తో పగులగొట్టే ప్రయత్నం చేశారు. పెద్ద శబ్దం రావడంతో తిలకవతి నిద్ర లేచింది. దుండగులు కత్తి చూపించి ఆమెను బెదించారు. మెడలో ఉన్న నగలు, చెవిలో రింగులు, ఉంగరం, వెండి వస్తువులు తీసుకుని పారిపోయారు. తిలకవతి చుట్టుపక్కల వారికి విషయం చెప్పి ఎమ్మార్‌పల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. సీసీ ఫుటేజ్ ఆధారంగా పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. దుండగుల కోసం గాలిస్తున్నట్లు తిరుపతి రూరల్ సీఐ అహమ్మద్ చెప్పారు.

తిరుపతి

సంస్కృత సాహిత్యానికి, సంగీతానికి అవినాభావ సంబంధం



మాట్లాడుతున్న ప్రొఫెసర్ రాణీసదాశివమూర్తి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 15: సంస్కృత సాహిత్యానికీ, సంగీతానికి అవినాభావ సంబంధం ఉందని ఎస్వీ వేద విశ్వవిద్యాలయ వీసీ ప్రొఫెసర్ రాణీసదాశివమూర్తి పేర్కొన్నారు. పద్మావతి యూనివర్సిటీ సంగీత, నృత్య లలిత కళల విభాగంలో సంగంద పేరుతో శుక్రవారం నిర్వహించిన జాతీయ సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. వేదాల నుంచి నేటి వరకు సంస్కృత సాహిత్యంతో సంగీతానికి విడదీయరాని అనుబంధం ఉందని తెలిపారు. పద్మావతి వర్సిటీ వీసీ ప్రొఫెసర్ భారతి మాట్లాడుతూ విద్యార్థులు సాహిత్యం, సంగీతం పట్ల మక్కువ పెంచుకోవాలన్నారు. తద్వారా సృజనాత్మకత, మానసిక ప్రశాంతత ఏర్పడుతుందని తెలిపారు. ఎస్వీ మ్యూజిక్ కాలేజీ ప్రిన్సిపాల్ ముద్దుబాల మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సదస్సు కన్వీనర్ శైలేశ్వరి, కో-కన్వీనర్ హిమబిందు పాల్గొన్నారు.

ప్రీమెట్రిక్ స్కాలర్‌షిప్‌కు ఏప్రిల్ 10న ఆఖరు

తిరుపతి (రవాణా), మార్చి 15: ప్రీమెట్రిక్ స్కాలర్‌షిప్‌నకు ఏప్రిల్ 10వ తేదీలోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని జిల్లా ఎస్సీ సంక్షేమ. సాధికారత అధికారి యు.చెన్నయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ప్రైవేటు గుర్తింపు పొందిన పాఠశాలల్లో చదివే మాన్యువల్ స్కావెంజర్స్(అపరిశుభ్ర పనిలో జీవించే వారు), చర్మకారులు, ఫ్లేయర్స్, వేస్ట్ పిక్కర్స్(వ్యర్థాలను సేకరించేవారు), హజార్డౌస్ క్లీనింగ్ (ప్రమాదకర పరిసరాలను శుభ్రపరచడంలో నిమగ్నమైన) పిల్లలు అర్హులని పేర్కొన్నారు. 1 నుంచి 10వ తరగతి విద్యార్థులకు (డే స్కాలర్) రూ.3 వేలు, హాస్టల్ వసతి పొందే వారికి రూ.8 వేలు మంజూరు చేస్తారని పేర్కొన్నారు. అర్హత కలిగిన విద్యార్థులు వారికి సంబంధించిన సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు.

28న బార్ అసోసియేషన్ ఎన్నికలు

- 8పోస్టులకు 11మంది నామినేషన్


నామినేషన్ వేస్తున్న అభ్యర్థి

తిరుపతి(లీగల్), మార్చి 15: తిరుపతి బార్ అసోసియేషన్ ఎన్నికలు ఈనెల 28న తిరుపతి కోర్టు ప్రాంగణంలో నిర్వహించనున్నట్లు ఎన్నికల అధికారి ఊటుపల్లె లక్ష్మన్న తెలిపారు. 8పోస్టులకు 11మంది నామినేషన్ దాఖలు చేసినట్లు పేర్కొన్నారు. 2024-25 ఏడాది కాలపరిమితికి అధ్యక్ష పదవికి టి.గోపిచంద్, రాజమాణిక్యం, ఉపాధ్యక్ష స్థానానికి భవానీశంకర్, మునెయ్య, ప్రధాన కార్యదర్శి పదవికి జోషఫ్ మార్టిన్, వై.షణ్ముగం పోటీ పడుతున్నారు. మిగిలిన 5పదవులకు ఒక్కొక్కరే నామినేషన్ దాఖలు చేయడంతో అవి ఏకగ్రీవమయ్యాయని వివరించారు.

ముగిసిన తేనెటీగల పెంపక సదస్సు



తిరుపతి(రూరల్), మార్చి 15: తిరుపతి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానంలో తేనెటీగల పెంపకంపై రెండ్రోజులపాటు నిర్వహించిన రాష్ట్ర స్థాయి సదస్సు శుక్రవారంతో ముగిసింది. తేనెటీగల పెంపకంలో మెళకువలు, ప్రాసెసింగ్, ప్యాకేజింగ్, మార్కెటింగ్ అవకాశాలు, విలువ ఆధారిత ఉత్పత్తులపై రైతులు, మహిళలు, విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఏడీఆర్ డాక్టర్ సి.రమణ మాట్లాడుతూ శిక్షణ కోసం ఆసక్తి ఉన్న రైతులు గ్రూపు(10-20మంది)ను ఏర్పాటు చేసుకోవాలని, వారివారి జిల్లాలోనే శిక్షణతోపాటు జాతీయ తేనెటీగల బోర్డు, హార్టికల్చర్ డిపార్ట్‌మెంట్ ద్వారా సబ్సిడీ అందిస్తారని వివరించారు. వ్యవసాయ వర్సిటీ ఈసీ సభ్యుడు డాక్టర్ పీవీ సత్యగోపాల్, స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ సుధాకర్, ప్రధాన శాస్త్రవేత్తలు డాక్టర్ మురళీకృష్ణ, డాక్టర్ మోహన్‌రావు, కడప, నెల్లూరు జిల్లాలకు చెందిన రైతులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు ఇంటిస్థలాల రిజిస్ట్రేషన్ పత్రాల పంపిణీ


రిజిస్ట్రేషన్ పత్రాలు అందజేస్తున్న మేయర్ శిరీష

తిరుపతి అర్బన్, మార్చి 15: నగర పరిధిలోని 27వ డివిజన్‌లో 202మంది లబ్ధిదారులకు శుక్రవారం మేయర్ డాక్టర్ శిరీష ఇంటి స్థలాల రిజిస్ట్రేషన్ పత్రాలు పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ పేద మహిళల సొంతింటి కల నెరవేర్చిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. ఖర్చు లేకుండా రిజిస్ట్రేషన్ చేయించి, సర్వహక్కులు కల్పిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు తులసీయాదవ్, భరణియాదవ్, చింతా రమేష్, గీతాయాదవ్, మునిశేఖర్, గజేంద్ర, నాగేశ్వరరావు, వార్డు సచివాలయ సిబ్బంది గోపాలకృష్ణ, పల్లవి, ఉషారాణి, రేవతి, నిరంజన్, గాయత్రి, రెడ్డిశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

జనరిక్ మందులపై అవగాహన అవసరం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 15: జనరిక్ మందుల గురించి అవగాహన పెంచుకోవాలని డాక్టర్ శ్రావ్య, డాక్టర్ అనిత పేర్కొన్నారు. ప్రస్తుత వైద్య రంగంలో జనరిక్ మందుల ప్రాముఖ్యత అంశంపై పద్మావతి యూనివర్సిటీ ఫార్మసీ విభాగంలో శుక్రవారం నిర్వహించిన వెబినార్‌లో వారు పాల్గొని మాట్లాడారు. ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవడానికి జనరిక్ మందులు ఉపయోగపడతాయన్నారు. ప్రభుత్వం 7,500 రకాల జనౌషధి కేంద్రాల ద్వారా జనరిక్ మందులను ప్రజలకు అందుబాటులో ఉంచిందని, తక్కువ ధరకు లభిస్తున్నాయన్నారు. కార్యక్రమంలో ప్రోగ్రాం కన్వీనర్ రమ్యకుబేర్, శైలజ పాల్గొన్నారు.

రేపు రెజ్లింగ్ బాలికల జట్టు ఎంపిక

తిరుపతి(క్రీడలు), మార్చి 15: రెజ్లింగ్ అండర్ 20 బాలికల జిల్లా జట్టును ఆదివారం ఎంపిక చేయనున్నట్లు రెజ్లింగ్ జిల్లా కమిటీ అధ్యక్షుడు ఎన్.సురేష్, కార్యదర్శి బి.ఉదయ్‌కుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. 2004, 2005, 2006సంవత్సరాల్లో జన్మించిన వారు ఆధార్, పదవ తరగతి మార్కులిస్టు తీసుకురావాలన్నారు. వివరాలకు 9000024837 ను సంప్రదించాలని కోరారు.

రేపటి గ్రూప్-1 పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు

- హాజరుకానున్న 9,377 మంది అభ్యర్థులు

తిరుపతి(కలెక్టరేట్), మార్చి 15: జిల్లాలో ఆదివారం జరిగే ఏపీపీఎస్సీ గ్రూప్-1 పరీక్ష కోసం పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ లక్ష్మీశ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో పరీక్షల ఏర్పాట్లపై ఆయన సమీక్షించారు. కేంద్రాల వద్ద మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. తిరుపతి నగర, రూరల్ పరిధిలో 16 కేంద్రాలు ఏర్పాటు చేశామని, 9,377మంది అభ్యర్థులు హాజరుకానున్నారని వెల్లడించారు. 16 మంది లైజన్ అధికారులను నియమించినట్లు చెప్పారు. గర్భిణులు, విభిన్న ప్రతిభావంతులు, అంధులు గ్రౌండ్‌ఫ్లోర్‌లో పరీక్ష రాసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సీసీ కెమెరాల పర్యవేక్షణలో ఈ పరీక్షలు ఉంటాయని, అభ్యర్థులు సకాలంలో చేరుకోవాలని సూచించారు. హాల్‌టిక్కెట్, ప్రభుత్వం జారీ చేసిన ఏదైనా గుర్తింపుకార్డు తీసుకురావాలన్నారు. కేంద్రాల వద్ద తగినంత బందోబస్తు కల్పించాలని పోలీసు అధికారులను అదేశించారు. 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. అభ్యర్థులు సమాచారం కోసం కంట్రోల్ రూం 9000665565, 9676928804లను సంప్రదించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో పెంచలకిషోర్, ఆర్డీవో నిశాంత్‌రెడ్డి, లైజన్ అధికారులు, పరీక్ష కేంద్రాల వద్ద చీఫ్ సూపరింటెండెంట్లు హాజరయ్యారు.

ఆరోగ్యంపై శ్రద్ధ చూపండి

తిరుపతిసెంట్రల్, మార్చి 15: రైల్వే ఉద్యోగులు, భద్రతాదళాలు విధులతోపాటు ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపాలని రైల్వే డాక్టర్ రిహాన ఫరాన్ అన్నారు. శుక్రవారం రైల్వే స్టేషన్‌లోని వీఐపీ లాంజ్‌లో ఉద్యోగులకు, అధికారులకు ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహించారు. రైల్వే సంస్థలో ఉద్యోగులు అనునిత్యం విధి నిర్వహణలో మానసిక ఒత్తిడికి గురవుతుంటారని, తరచూ ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. రైల్వే భద్రత దళాల ఇన్‌స్పెక్టర్ మధుసూదన్, ఎస్‌ఐలు రాంబాబు, రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.4.71 కోట్లు

తిరుమల, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.4.71 కోట్లు లభించింది. బుధవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ గురువారం లెక్కించి శుక్రవారం ఉదయం ప్రకటించింది. ఇక, గురువారం 48,444 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 23,266 మంది తలనీలాలు సమర్పించారు.

టీటీడీకి కానుకగా ద్విచక్ర వాహనం



తిరుమల, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): టీటీడీకి శుక్రవారం ద్విచక్ర వాహనం కానుకగా అందింది. ఢిల్లీకి చెందిన హీరో మోటార్స్ కార్పొరేషన్ నిర్వాహకులు రూ.1.30 లక్షల విలువైన హీరో ఎక్స్‌ట్రీమ్ 125 సీసీ బైక్‌ను విరాళంగా ఇచ్చారు. వాహనానికి శుక్రవారం ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించి, తాళాలను హీరో మోటార్స్ సంస్థ ప్రతినిధులు లక్ష్మీషా శ్రీవారి ఆలయ డిప్యూటీ ఈవో లోకనాథానికి అందజేశారు. తిరుమల ట్రాన్స్‌పోర్టు డీఐ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

డాక్టరేట్ ప్రదానం


పార్వతి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 15: ఎస్వీ యూనివర్సిటీ ఇంగ్లిషు డిపార్ట్‌మెంట్ పరిశోధకురాలు ఎం.పార్వతి డాక్టరేట్ పొందారు. ఆర్‌కె నారాయణ - ఫాక్‌నర్ కథానికలు-తులనాత్మక పరిశీలన అంశం పై రిటైర్డు ప్రొఫెసర్ కుసుమహరినాథ్ పర్యవేక్షణలో పరిశోధన పూర్తి చేశారు. పార్వతి ప్రస్తుతం మిట్స్ కాలేజీలో అధ్యాపకురాలిగా ఉన్నారు. ఈ మేరకు వర్సిటీ మీడియా కో-ఆర్డినేటర్ ప్రొఫెసర్ పీసీ వేంకటేశ్వర్లు తెలిపారు.

రేపు లంకమల దారుల్లో పుస్తక పరిచయ సభ

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 15: రచయిత వివేక్ రాసిన లంకమల దారుల్లో పుస్తక పరిచయ సభ ఆదివారం ఎస్వీయూ సెనేట్ హాల్లో నిర్వహించనున్నారు. సాయంత్రం 4 గంటలకు ప్రారంభం కానున్న ఈ సభలో శ్వేత డైరెక్టర్ భూమన్, ఫారెస్టు కన్జర్వేటివ్ ఆఫీసర్ నాగేశ్వరరావు, జర్నలిస్టు తాడి ప్రకాష్, ప్రజా వాగ్గేయకారుడు గోరటి వెంకన్న, మాజీ వీసీ కుసుమకుమారి, శివ, టీవీ రమణ పాల్గొంటారు. తిరుపతి ట్రెక్కర్స్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించనున్నారు.

నేడు జనసేన పార్టీ సమావేశం

తిరుపతి, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): తిరుపతి జనసేన అభ్యర్థిగా ఆరణి శ్రీనివాసులును ప్రకటించిన తర్వాత నెలకొన్న పరిణామాల నేపథ్యంలో శనివారం జనసేన పార్టీ ముఖ్య సమావేశం నిర్వహించతలపెట్టడం చర్చనీయాంశంగా మారింది. ఉదయ్ ఇంటర్నేషన్ హోటల్లో ఉదయం 10.30 గంటలకు తిరుపతి జిల్లా, పట్టణ కమిటీ సభ్యులు, వీరమహిళలు, జనసైనికులు తప్పకుండా హాజరుకావాలని ఆ పార్టీకి చెందిన సోషల్ మీడియా గ్రూపుల్లో ప్రకటన వచ్చింది. ఆరణి శ్రీనివాసులును వ్యతిరేకిస్తున్న తిరుపతి నియోజకవర్గ ఇన్‌చార్జి కిరణ్ రాయల్ నేతృత్వంలో జరగనున్న ఈ సమావేశం ప్రాధాన్యత సంతరించుకుంది.

రుణమాఫీ కావాలన్నా.. కొత్త రుణాలు రావాలన్నా

మార్టులో సరుకులు కొనాల్సిందే..!

- మహిళా సంఘాల సభ్యులకు ఆర్పీల ఆదేశం



జగనన్న మహిళా మార్టు - మార్టులో సరుకులు కొనుగోలు చేసినట్లు సంఘ సభ్యులు గ్రూపులో పెట్టిన బిల్లులు

తిరుపతి(కపిలతీర్థం), మార్చి 15: 'మీకు కొత్త రుణాలు కావాలన్నా.. రుణమాఫీ జరగాలన్నా.. సంఘంలో ఉండాలన్నా నెలలో ఒకసారి జగనన్న మార్టుకు వచ్చి కనీసం రూ.500 తగ్గకుండా సరుకులు కొనుగోలు చేయండి. లేకపోతే సంఘం నుంచి వెళ్లిపోండి' అంటూ ఆర్పీలు మహిళా సంఘాల సభ్యులకు హుకుం జారీ చేస్తున్నారు. జగనన్న మార్టు పేరుతో ఓ చిల్లర దుకాణం పెట్టి అందులో నాణ్యత లేని వస్తువులు, నిత్యావసర సరుకులు పెట్టి బలవంతంగా కొనుగోలు చేయించడంపై సంఘ సభ్యులు తీవ్ర ఆగ్రహానికి గురవుతున్నారు. ఎంతకు కొనాలి.. ఎప్పుడెప్పుడు కొనాలి.. అనేది కూడా ఆర్పీలే నిర్ణయించడంపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. నగర పరిధిలో సరస్వతి, స్పందన, అభ్యుదయ, పద్మావతి పట్టణ సమాఖ్యల నుంచి రూ.150 వసూలు చేసి, సుమారు రూ.6 లక్షలతో పంచముఖ ఆంజనేయస్వామి సర్కిల్లోని మున్సిపల్ వాణిజ్య సముదాయంలో 2022 మే 4న జగనన్న మహిళా మార్టును ఏర్పాటు చేశారు. సంఘంలోని సభ్యులకు రాయితీపై నిత్యావసర సరుకులు ఇస్తామని చెప్పారు. నగరంలో ఉన్న దాదాపు 50 వేల మంది సభ్యుల్లో ఏడాదికి ఒక్కరు రూ.వెయ్యికి కొనుగోలు చేసినా దాదాపు రూ.2.50 కోట్ల వ్యాపారం జరుగుతుందని అంచనా వేశారు. అయితే సాధారణ దుకాణాల్లో మాదిరిగానే ఇక్కడా ధరలు ఉండడంతో దూర ప్రాంతాల నుంచి సంఘ సభ్యులు వచ్చి కొనుగోలు చేసేందుకు పెద్దగా ఆసక్తి చూపలేదు. దీంతో ప్రారంభంలో రెండు నెలలు అంతంత మాత్రంగానే నడిచింది. దీంతో బలవంతపు వ్యాపారానికి తెరలేపారు. మొదట్లో రూ.రోజుకు రూ.20 వేలు కూడా జరగని వ్యాపారం ఇప్పుడు రూ.1.50 లక్షలకు పైగా జరుగుతుందం టే ఒత్తిడి ఏ స్థాయిలో ఉందో గ్రహించవచ్చు.

పై అధికారుల నుంచి ఒత్తిడులు..

'ఈ వ్యాపారంలో నష్టాలు వస్తే సహించేది లేదు. ఏం చేస్తారో ఎలా చెప్తారో మాకు తెలీదు. మీ పరిధిలో ఉన్న ప్రతి సంఘంలోని సభ్యులు నెలకు రూ.కనీసం 500లకైనా మార్టులో కొనుగోలు చేయాల్సిందే. ఇది మీ బాధ్యత.. లేకపోతే చర్యలు తప్పవు..' అంటూ సీవోలకు, ఆర్పీలకు మెప్మా అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఇంకేముంది అధికారుల ఒత్తిడి మేరకు మహిళా సంఘాల సభ్యులపై సీవోలు, ఆర్పీలు కొరడా ఝుళిపిస్తున్నారు.

వినియోగదారులు హక్కులను సద్వినియోగం చేసుకోవాలి


బుక్‌లెట్‌ను ఆవిష్కరిస్తున్న ముఖ్య అతిథులు

తిరుపతి(ఉపాధ్యాయనగర్), మార్చి 15: వినియోగదారులు తమ హక్కులను సద్వినియోగం చేసుకోవాలని తిరుపతి వినియోగదారుల కమిషన్ జడ్జి ఎ.పార్థసారథి కోరారు. శుక్రవారం ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని తిరుపతి వినియోదారుల సమాచార కేంద్రం, పౌర సరఫరాల శాఖ సంయుక్తంగా ఎస్వీ ఆర్ట్స్ కళాశాలలో 'వినియోగదారుల కోసం న్యాయమైన, బాధ్యతాయుతమైన కృత్రిమ మేధస్సు' అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ బాధ్యతగా తమ హక్కులను తెలుసుకోవాలని సూచించారు. టీటీడీ విద్యాశాఖాధికారి డాక్టర్ ఎం.భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ కృత్రిమ మేధస్సుతో జరుగుతున్న పరిశోధనలు, ఈ టెక్నాలజీ దుర్వినియోగం కాకుండా జాగ్రత్తపడాలని చెప్పారు. జిల్లా వినియోగదారుల సంఘం అధ్యక్షుడు రాజారెడ్డి మాట్లాడుతూ వినియోగదారుల చట్టాలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరాలశాఖ అధికారి రఘువీర్, సహాయ అధికారి రెడ్డి చంద్రిక, జయరాజ్, తూనికలు, కొలతల శాఖ ఇన్‌స్పెక్టర్ మల్లేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల సామగ్రి పరిశీలన


ఓటింగ్ సామగ్రిని పరిశీలిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

తిరుపతి (కలెక్టరేట్), మార్చి 15: కలెక్టరేట్‌కు శుక్రవారం చేరుకున్న ఎన్నికల సామగ్రిని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి లక్ష్మీశ పరిశీలించారు. ప్రిసైడింగ్ అధికారి, ఆర్వో హ్యాండ్‌బుక్ తదితరాలను ఎస్డీసీ మురళితో కలిసి పరిశీలించారు. ఎన్నికల సెక్షన్ సిబ్బంది పాల్గొన్నారు.

మళ్లీ మోదీనే పీఎం కావాలని కోరుకున్నా..

- కేంద్రమంత్రి కైలాష్ చౌదరి


కైలాష్ చౌదరి - అశ్విని శ్రీ - రఘునందన్ రావు

తిరుమల, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): రానున్న ఎన్నికల్లో 400కు పైగా లోక్‌సభ స్థానాలు గెలిచి నరేంద్రమోదీ మూడవసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని స్వామిని కోరుకున్నట్లు కేంద్రమంత్రి కైలాష్ చౌదరి తెలిపారు. శుక్రవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. దేశ అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్న మోదీకి ప్రజలు మద్దతుండాలని ఆకాంక్షించారు. కాగా తెలంగాణ బీజేపీ నేత రఘునందన్‌రావు శ్రీవారిని దర్శించుకున్నారు. తెలంగాణాలో 17 ఎంపీ సీట్లు టార్గెట్ పెట్టుకున్నామని, కచ్చితంగా 15 స్థానాలు గెలుస్తామనే నమ్మకం ఉందన్నారు. ఇంకా ఎంపీ మోపిదేవి వెంకటరమణ, కలెక్టర్ లక్ష్మీశ, బిగ్‌బాస్7 అశ్విని శ్రీ స్వామిని దర్శించుకున్నారు.

పోలీసుల అదుపులో పాదరక్షల దొంగ



తిరుమల, మార్చి15(ఆంధ్రజ్యోతి): తిరుమలలో భక్తుల పాదరక్షలను(చెప్పులు) దొంగలించే వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. శుక్రవారం ఉదయం కల్యాణకట్ట ప్రాంతంలో అనుమానితంగా తిరుగుతున్న ఓ యువకుడిని విజిలెన్స్ సిబ్బంది అదుపులోకి తీసుకున్నారు. అతని వద్దనున్న బ్యాగ్‌ను తనిఖీ చేయగా దాదాపు 30 జత పాదరక్షలు ఉన్నట్టు గుర్తించారు. వెంటనే క్రైం పోలీసులకు అప్పగించారు. ఐదు మంది బృందాలుగా విడిపోయి క్యూలైన్లు, కాటేజీలు, కార్యాలయాలు, కల్యాణకట్టలు, ఆలయ పరిసర ప్రాంతాల్లో భక్తులు విడిచిపెట్టే ఖరీదైన చెప్పులను దొంగించి ఇతర ప్రాంతాల్లో విక్రయిస్తున్నట్టు విచారణలో తేలింది. మిగిలిన వారిని కూడా పట్టుకునేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు.

మీటర్ రీడింగ్‌లో అలసత్వం

- వినియోగదారులపై పెరుగుతున్న బిల్లుల భారం

తిరుపతి సెంట్రల్, మార్చి 15: విద్యుత్ సంస్థలో మీటర్ రీడింగ్ పనులను ప్రైవేటు వారికి అప్పగించారు. వారు సకాలంలో రీడింగ్ తీయకపోవడంతో వినియోగదారులపై భారం పడుతోంది. ఏపీ సదరన్ డిస్కం పరిధిలోని తిరుపతి సర్కిల్(ఉమ్మడి చిత్తూరు జిల్లా)లో క్యాటగిరి-1 గృహ విద్యుత్ సర్వీసులు 12,31,869 ఉన్నాయి. కేటగిరి-2లో (దుకాణాలు, వ్యాపార సంస్థలు)1,43,742 సర్వీసులు ఉన్నాయి. ఈ సర్వీసులకు ప్రతినెలా మొదటివారంలో నిర్ణయించిన తేదీలకు మీటర్ రీడింగ్ తీయాలి. నిర్ణయించిన తేదీకంటే రెండు, మూడు రోజులు ఆలస్యంగా తీయడం వల్ల యూనిట్ల సంఖ్య పెరుగుతోంది. దీంతో స్లాబ్ రేట్లు పెరిగి చార్జీల భారం పెరుగుతోందని వినియోగదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో విద్యుత్ రెగ్యులర్ ఉద్యోగులు నిర్దేశిత సమయంలో రీడింగ్ తీసేటప్పుడు ఇలాంటి వ్యత్యాసాలు ఉండేవి కాదని వినియోగదారులు తెలిపారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి రీడింగ్‌లో ఆలస్యాన్ని నివారించాలని కోరుతున్నారు.

పోలీసు కేసుల ఎత్తివేతపై హర్షం

తిరుపతి సెంట్రల్, మార్చి15: మున్సిపల్ కార్మికుల, ఇతర సమస్యలపై జరిగిన పోరాట సమయంలో నమోదైన పోలీసు కేసులను ఎత్తివేస్తూ ప్రభుత్వం జీవో విడుదల చేయడం పట్ల ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.రాధాకృష్ణ, చంద్రశేఖర్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. మున్సిపల్ కార్మికుల వేతనాల పెంపు, ఇతర సమస్యలపై గత ఏడాది డిసెంబరు 26 నుంచి జనవరి 10వ తేదీ వరకు జరిగిన పోరాట సమయంలో పోలీసులు పెట్టిన కేసులపై ప్రభుత్వంతో పలు మార్లు జరిపిన చర్చల కారణంగా జీవో విడుదల చేయడం అభినందనీయమని పేర్కొన్నారు.

కాంగ్రెస్ ఎస్సీ, మైనార్టీ సెల్స్ నూతన కార్యవర్గం



తిరుపతి(కపిలతీర్థం), మార్చి 15: కాంగ్రెస్ పార్టీ ఎస్సీ, మైనారిటీ సెల్స్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడిగా చిత్తూరు శివశంకర్‌ను, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పవన్‌కుమార్‌ను, మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షురాలిగా మేసీనా బేగంను నియమించినట్లు ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు సాకే శంకర్ తెలిపారు. ప్రెస్‌క్లబ్ ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల అభ్యున్నతికి కాంగ్రెస్ పార్టీ పెద్దపీట వేస్తోందన్నారు.

ఏపీ హంస సంఘానికి ప్రభుత్వ గుర్తింపు


రాజాను అభినందిస్తున్న డీఎంహెచ్‌వో శ్రీహరి

తిరుపతి(వైద్యం), మార్చి 15: వైద్య ఉద్యోగుల సమస్యలపై పోరాడుతున్న ఏపీ హంస సంఘానికి ప్రభుత్వ గుర్తింపు లభించడం అభినందనీయమని ఆ సంఘం ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షుడు రాజా అన్నారు. ఆయన శుక్రవారం డీఎంహెచ్‌వో శ్రీహరి, రుయా, ప్రసూతి అస్పత్రుల సూపరింటెండెంట్లు రవిప్రభు, పార్థసారథిరెడ్డిని కలిసి పుష్పగుచ్ఛాలు అందించారు. వైద్య ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు ఇమ్రాన్, ప్రధాన కార్యదర్శి టాటా బాయ్, నేతలు రీటా, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.


టెన్త్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు: డీఈవో


డీఈవో డాక్టర్ వి.శేఖర్

తిరుపతి(విద్య), మార్చి 15: ఈనెల 18 నుంచి ప్రారంభం కానున్న పదవ తరగతి పబ్లిక్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు డీఈవో డాక్టర్ వి.శేఖర్ పేర్కొన్నారు. జిల్లాలో 162 కేంద్రాలను ఏర్పాటు చేశామని, 30,921మంది విద్యార్థులు హాజరవుతారని వెల్లడించారు. వీరిలో రెగ్యులర్ విద్యార్థులు 27,012మంది, ప్రైవేట్ విద్యార్థులు 3,909మంది ఉన్నారని, నిర్దేశిత తేదీల్లో ఉదయం 9.30-12.45గంటల వరకు పరీక్షలు జరుగుతాయని తెలిపారు. పరీక్షలను పారదర్శంగా, పటిష్టంగా నిర్వహించేందుకు 1,665మంది ఇన్విజిలేటర్లు, 162 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 162మంది డిపార్ట్‌మెంటల్ అధికారులతోపాటు 6ఫ్లైయింగ్ స్క్వాడ్‌లను నియమించినట్లు వివరించారు. కేంద్రాల వద్ద 144సెక్షన్ అమలులో ఉంటుందని తెలిపారు. విద్యార్థుల కోసం డీఈవో కార్యాలయంలో హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేస్తున్నామని, కేంద్రాల్లో ఏవైనా ఇబ్బందులు ఎదురైతే ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. అలాగే ఈ నెల18 నుంచి అదే పరీక్ష కేంద్రాల్లో ఓపెన్‌స్కూల్‌కి సంబంధించి టెన్త్, ఇంటర్ పరీక్షలు జరుగుతాయి. మధ్యాహ్నం 2.30-5.30గంటల వరకు ఈ పరీక్షలు నిర్వహిస్తారు. జిల్లాలో మొత్తం 20కేంద్రాలు ఏర్పాటు చేశారు. టెన్త్‌లో రెగ్యులర్, ప్రైవేట్ విద్యార్థులు 1,611మంది, ఇంటర్‌లో రెగ్యులర్, ప్రైవేట్ విద్యార్థులు 3,235మంది హాజరుకానున్నట్లు డీఈవో పేర్కొన్నారు.

మసాజ్ సెంటర్ల ముసుగులో చీకటి వ్యాపారం

- నగరంలో విచ్చలవిడిగా స్పా కేంద్రాలు


పోలీసులు దాడి చేసిన సి7 స్పా కేంద్రం

తిరుపతి క్రైం, మార్చి 15: నగరంలో ఇటీవల కాలంలో స్పా సెంటర్లు ఇబ్బడిముబ్బడిగా వెలుస్తున్నాయి. హైదరాబాద్, రాజమండ్రి, విజయవాడ, గుంటూరు, చెన్నై ప్రాంతాల నుంచి యువతులను రప్పించి డబ్బు ఆశచూపి వ్యభిచార కూపంలోకి దింపుతున్నారు. రెండు రోజుల క్రితం డీబీఆర్ ఆస్పత్రి రోడ్డులోని సి7 స్పా కేంద్రంలో సాగుతున్న చీకటి దందాను పోలీసులు రట్టు చేశారు. స్పా నిర్వాహకులపై పోలీసులు కేసు నమోదు చేసి, ముగ్గురు యువతులను అదుపులోకి తీసుకున్నారు. బాలాజీ కాలనీ, కేటీ రోడ్డు, స్విమ్స్ ఆస్పత్రి రోడ్డు, తిరుచానూరు రోడ్డు, మంగళం, జీవకోన, మధురానగర్, లీలామహల్ సర్కిల్, ఎయిర్‌బైపాస్ రోడ్డుతో పాటు శివారు ప్రాంతాల్లో ఈ తరహా వ్యవహారాలు ఎక్కువగా నడుస్తున్నాయి. ఎవరికీ అనుమానం రాకుండా కోడ్ లాంగ్వేజ్‌తో ఆన్‌లైన్‌లోనే లావాదేవీలు సాగిస్తున్నట్లు తెలుస్తోంది. నెలకు ఒక్కో మసాజ్ సెంటర్‌లో రూ.15లక్షల నుంచి రూ.20 లక్షల వరకు వ్యాపారం జరుగుతున్నట్లు సమాచారం. ఈ విషయం పోలీసు అధికారులకు తెలిసినా మామూళ్లతో సరిపెట్టుకుంటున్నారన్న ఆరోపణలున్నాయి.+

ఉరేసుకొని టీమాస్టర్ ఆత్మహత్య


సత్యనారాయణ మృతదేహం

సూళ్లూరుపేట, మార్చి 15: ఉరేసుకొని టీ మాస్టర్ ఆత్మహత్య చేసుకున్న ఘటన సూళ్లూరుపేట పట్టణంలో శుక్రవారం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. శ్రీకాకుళం జిల్లా వంగర మండలం కింజంగి గ్రామానికి చెందిన తెర్లి సత్యనారాయణ(32) సూళ్లూరుపేట పట్టణంలోని ఆర్టీసీ బస్టాండు వద్దనున్న టీ షాపులో ఏడేళ్లుగా టీ మాస్టర్‌గా పనిచేస్తున్నాడు. బస్టాండు వెనుకనున్న ఆపార్ట్‌మెంటులో నివాసం ఉంటున్న సత్యనారాయణ శుక్రవారం ఉదయం దుకాణానికి వచ్చాడు. గదిలో నగదు మరిచిపోయానని క్యాషియర్ శేఖర్‌కు చెప్పి ఇంటికి వెళ్లాడు. చాలాసేపటి వరకు రాకపోవడంతో దుకాణంలో పనిచేస్తున్న మరో వ్యక్తి వెళ్లి చూడగా గదిలో ఫ్యాన్‌కు ఉరేసుకొని కనిపించాడు. విషయం తెలుసుకున్న దుకాణ యజమాని వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఎస్‌ఐ రహీం రెడ్డి సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడి బంధువులకు సమాచారం అందించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మెమో రైలులో సాంకేతిక లోపం

డీవీసత్రంలో రెండు గంటల పాటు నిలిపివేత

దొరవారిసత్రం, మార్చి 15: నెల్లూరు - చెన్నై మధ్య నడిచే మెమో రైలులో శుక్రవారం సాంకేతిక లోపం ఏర్పడింది. ఉదయం 10.20 గంటలకు నెల్లూరు నుంచి చెన్నై బయలుదేరిన మెమో రైలు 12 గంటల ప్రాంతంలో దొరవారి సత్రం రైల్వేస్టేషన్ సమీపానికి చేరుకొంది. ఆ సమయంలో రైలులో ఇంజన్‌కు పవర్ అందించే ఓహెచ్‌సీ స్టాండ్ విరిగిపోయింది. గుర్తించిన లోకో పైలెట్ దొరవారిసత్రం రైల్వేస్టేషన్‌లో లూప్‌లైన్‌లో రైలును ఆపేశారు. సుమారు రెండు గంటల పాటు శ్రమించిన సిబ్బంది విరిగిపోయిన స్టాండ్‌ను సరిచేశారు. అనంతరం రైలు చెన్నైకు బయలుదేరి వెళ్లింది. రెండు గంటల సేపు రైలు ఆగిపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు.

ఆర్టీసీ బస్సులను వైసీపీ సభలకే ఇస్తారా?: పాశం


సమావేశంలో మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్

గూడూరు, మార్చి 15: ఆర్టీసీ బస్సులను వైసీపీ సభలకు మాత్రమే ఇస్తారా అని మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ ప్రశ్నించారు. శుక్రవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 17వ తేదీన చిలకలూరిపేటలో బీజేపీ - టీడీపీ - జనసేన ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఉమ్మడి బహిరంగసభకు నియోజకవర్గ పరిధి నుంచి ప్రజలు హాజరయ్యేందుకు ఆర్టీసీ బస్సులు ఇవ్వమని అధికారులను అడుగుతుంటే మీనమేషాలు లెక్కబెడుతున్నారని అన్నారు. వైసీపీ ఆధ్వర్యంలో నిర్వహించే సిద్ధం సభలకు మాత్రం వెంటనే మంజూరు చేస్తున్నారన్నారు. ప్రధాని హాజరయ్యే సభకు బస్సులను కేటాయించాలని కోరుతుంటే నిర్లక్ష్యంగా వ్యవహరించడం మంచిపద్ధతి కాదన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు శీలం కిరణ్‌కుమార్, నెలబల్లి భాస్కర్‌రెడ్డి, పులిమి శ్రీనివాసులు, అబ్దుల్ రహీమ్, బిల్లు చెంచురామయ్య, రవీంద్రరెడ్డి, వాటంబేడు శివకుమార్, నరసింహులనాయుడు, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

రేపటి గ్రూప్-1 పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు

హాజరుకానున్న 9,377 మంది అభ్యర్థులు

తిరుపతి(కలెక్టరేట్), మార్చి 15: జిల్లాలో ఆదివారం జరిగే ఏపీపీఎస్సీ గ్రూప్-1 పరీక్ష కోసం పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ లక్ష్మీశ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో పరీక్షల ఏర్పాట్లపై ఆయన సమీక్షించారు. కేంద్రాల వద్ద మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. తిరుపతి నగర, రూరల్ పరిధిలో 16 కేంద్రాలు ఏర్పాటు చేశామని, 9,377మంది అభ్యర్థులు హాజరుకానున్నారని వెల్లడించారు. 16 మంది లైజన్ అధికారులను నియమించినట్లు చెప్పారు. గర్భిణులు, విభిన్న ప్రతిభావంతులు, అంధులు గ్రౌండ్‌ఫ్లోర్‌లో పరీక్ష రాసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సీసీ కెమెరాల పర్యవేక్షణలో ఈ పరీక్షలు ఉంటాయని, అభ్యర్థులు సకాలంలో చేరుకోవాలని సూచించారు. హాల్‌టిక్కెట్, ప్రభుత్వం జారీ చేసిన ఏదైనా గుర్తింపుకార్డు తీసుకురావాలన్నారు. కేంద్రాల వద్ద తగినంత బందోబస్తు కల్పించాలని పోలీసు అధికారులను ఆదేశించారు. 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. అభ్యర్థులు సమాచారం కోసం కంట్రోల్ రూం 9000665565, 9676928804లను సంప్రదించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో పెంచలకిషోర్, ఆర్డీవో నిశాంత్‌రెడ్డి, లైజన్ అధికారులు, పరీక్ష కేంద్రాల వద్ద చీఫ్ సూపరింటెండెంట్లు హాజరయ్యారు.

ఏరియా కోఆర్డినేటర్‌కు రివర్షన్

కోట, మార్చి 15: వైఎస్సార్ క్రాంతిపథం ఏరియా కోఆర్డినేటర్‌గా పనిచేస్తున్న డాక్టర్ చంద్రబాబుకు రివర్షన్ ఇచ్చారు. ఈ మేరకు డీఆర్‌డీఏ పీడీ జ్యోతి అధికారికంగా శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు. చంద్రబాబు ఐదు నెలలుగా గూడూరు, చిల్లకూరు, కోట, వాకాడు, చిట్టమూరు మండలాల వైఎస్సార్ క్రాంతిపథం ఏరియా కోఆర్డినేటర్‌గా వ్యవహరిస్తున్నారు. ఈయనపై వచ్చిన పలు ఆరోపణల నేపథ్యంలో తిరిగి ఆయనను తిరుపతిలోని డీఆర్‌డీఏ ఆఫీసుకు పిలిపించి అక్కడే పోస్టింగ్ ఇవ్వనున్నట్లు అధికార వర్గాలు తెలిపారు.

రేషన్ బియ్యం స్వాధీనం

దొరవారిసత్రం, మార్చి 15: దొరవారిసత్రం మండలం తుంగమడుగు వద్ద అక్రమంగా రవాణ చేస్తున్న రేషన్ బియ్యాన్ని అధికారులు పట్టుకొన్నారు. బొలేరో వాహనంతో పాటు 72 బస్తాల్లో ఉన్న 3520 కిలోల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుని డ్రైవర్‌ను స్థానిక పోలీసులకు అప్పగించారు. బియ్యాన్ని సూళ్లూరుపేట ఎంఎల్‌సీ పాయింట్‌లో భద్రపరిచినట్లు సీఎస్ డీటీ ఓబయ్య తెలిపారు. ఈ దాడుల్లో విజిలెన్స్ ఎస్‌ఐ రామకృష్ణ నాయక్, సీనియర్ అసిస్టెంట్ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

ఏపీపీఎస్సీ నియామకాల్లో

రూ.150 కోట్లు చేతులు మారాయి: నెలవల


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం

పెళ్లకూరు, మార్చి 15: రాష్ట్రంలో అవినీతి, అక్రమాలు పరాకాష్టకు చేరుకున్నాయని, చివరకు ఏపీపీఎస్సీ నియామకాల్లో కూడా రూ.150 కోట్లు చేతులు మారాయని సూళ్లూరుపేట మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం ఆరోపించారు. శుక్రవారం పెళ్లకూరు మండలంలోని తాళ్వాయిపాడు గ్రామంలో నాయుడుపేట మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శిరసనంబేటి విజయభాస్కర్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ రఫీలతో కలిసి నెలవల మీడియాతో మాట్లాడారు. ఏపీపీఎస్సీ నియామకాల్లో అవినీతికి పాల్పడడం వైసీపీ ప్రభుత్వం అవినీతి పాలనకు అద్దం పడుతోందన్నారు. ఇసుక, మట్టి, గ్రావెల్ తదితర ప్రకృతి సంపదను కొల్లగొడుతూ అంతులేని అక్రమాలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. అవినీతి, అక్రమాల్లో కూరుకుపోయిన వైసీపీ ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు ప్రతి ఒక్కరూ నడుం బిగించాల్సిన అవసరముందని నెలవల అన్నారు. రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితుల్లో టీడీపీ, బీజేపీ, జనసేన కలయిక చారిత్రాత్మక అవసరమని, అదేవిధంగా టీడీపీ అధినేత చంద్రబాబునాయుడి నాయకత్వం రాష్ట్రానికి ఆవశ్యకమని స్పష్టం చేశారు. తన కుమార్తె నెలవల విజయశ్రీని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు. ఏఎంసీ మాజీ చైర్మన్ శిరసనంబేటి విజయభాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ వైసీపీ పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో వెనుకబడిపోవడంతో పాటు రూ.8 లక్షల కోట్ల అప్పుల్లో కూరుకుపోయిందన్నారు. కాగా, మండలంలోని తాళ్వాయిపాడు, పెన్నేపల్లి, కానూరు పంచాయతీల్లో మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం, ఏఎంసీ మాజీ చైర్మన్ శిరసనంబేటి విజయభాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో టీడీపీ, బీజేపీ, జనసేన ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ నెలవల విజయశ్రీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి చంద్రబాబునాయుడు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలను వివరిస్తూ కరపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా టీడీపీలో చేరిన 20 మందికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమాల్లో టీడీపీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య, ప్రధాన కార్యదర్శి దేవారెడ్డి నాగేంద్రప్రసాద్ రెడ్డి, కందమూడి శివకుమార్, గాలి రమేష్ నాయుడు, గోపాలరెడ్డి, పేరం మధునాయుడు, నెలవల రాజేష్, ప్రభావతమ్మ, సుధీర్‌రెడ్డి, పసల చెంగయ్య, దామెర ప్రసాద్‌నాయుడు, హరినాయుడు, గంగాబత్తిన రామకృష్ణ, శ్రీనివాసులు, భాస్కర్, బాలయ్య, గోపి, ఉచ్చూరు వెంకటయ్య, చలపతి, వెంకటేశ్వర్లు, అవధానం సుధీర్, యుంగధర్, పోలయ్య, బెన్నీ, వాసు, పరుశురాం, కేవీ నాయుడు, సత్యంరాజు సూరి నాయుడు, చక్రపాణి, బాబు, డి.సుబ్రహ్మణ్యం, గోపాలకృష్ణ, సుబ్రహ్మణ్యంరెడ్డి, నూతలపాటి ప్రసాద్ నాయుడు, రాధా నాయుడు, సిద్దులయ్య నాయుడు, రమణయ్య, ఏడుకొండలు, బాలరాజు, వెంకటేశ్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

నాన్న బాటలోనే నా పయనం: లక్ష్మీ సాయిప్రియ


సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మీ సాయిప్రియ, పక్కన కురుగొండ్ల

వెంకటగిరి, మార్చి 15: నాన్న బాటలోనే తానూ ప్రజాసేవ కొనసాగిస్తానని వెంకటగిరి నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి లక్ష్మీ సాయిప్రియ చెప్పారు. శుక్రవారం తండ్రి, మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణతో కలిసి ఆమె మీడియాతో మాట్లాడారు. నాన్న దీవేనలు... టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ఆశీస్సులు, నారా లోకేశ్ ప్రోత్సాహం, నియోజకవర్గ ప్రజల మద్దతుతో విజయం సాధిస్తానని ధీమా వ్యక్తం చేశారు. నాన అడుగు జాడల్లోనే నడుస్తానని స్పష్టం చేశారు. నియోజకంర్గంలో మహిళలకు ఆర్థికాభివృద్ధి, చేనేత కార్మికుల్లో నైపుణ్యం పెంపొందించేందుకు మంగళగిరి తరహాలో వెంకటగిరిలో చేనేత నైపుణ్య సంస్థను నెలకొల్పేందుకు కృషిచేస్తామని తెలిపారు. యువతకు ఉపాధి కల్పించడంతో పాటు రైతులను అన్ని విధాలా ఆదుకొంటామని చెప్పారు. మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ మాట్లాడుతూ తమ కుటుంబానికి నాలుగోసారి ఎమ్మెల్యేగా పోటీ చసే అవకాశం కల్పించినందుకు చంద్రబాబుకు రుణపడి వుంటామని చెప్పారు. తాను, తన కుమార్తె అన్నివేళల్లో అందుబాటులో వుండి సేవచేస్తామని, నియోజకవర్గ ప్రజలు తనలాగే తన కుమార్తెను కూడా ఆదరించి గెలింపించాలని కోరారు. కార్యక్రమంలో నియోజకవర్గ పార్టీ పరిశీలకుడు జర్ని రమణయ్య, నాయకులు పులికొల్లు రాజేశ్వరరావు, బీరం రాజేశ్వరరావు, కేవీకే ప్రసాద్ నాయుడు, శ్రీరాందాస్ గంగాధర్, పునుగోటి విశ్వనాధనాయుడు, అవ్వారు సత్యనారాయణ, కాపా శ్రీనివాసులునాయుడు, సీసీ నాయుడు, చెలికం భాస్కరరెడ్డి, పోలంరెడ్డి కోటేశ్వరరెడ్డి, చంగారావ్, మల్లిరం బాబు, మంకు ఆనంద్, గల్లా శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ గెలుపునకు సైనికుల్లా పనిచేయండి

గూడూరు, మార్చి 15: రానున్న ఎన్నికలలో టీడీపీ గెలుపునకు నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. శుక్రవారం స్థానిక జాతీయ రహదారి సమీపంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్‌హాలులో నియోజకవర్గ పరిధిలోని నాయకులతో ఎన్నికల ప్రచార నిర్వహణ, పోలింగ్ పర్యవేక్షణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికలు ఎంతో కీలకమైనవని, అందరం ఐక్యమత్యంతో కష్టపడి పనిచేసి పార్టీ గెలుపునకు కృషి చేద్దామన్నారు. ప్రభుత్వం అనుసరిస్తున్న వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి, ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి వస్తే అమలు చేయనున్న సంక్షేమ పథకాలను వివరించాలని సూచించారు. కార్యక్రమంలో రవీంద్రబాబు, శీలం కిరణ్‌కుమార్, భాస్కర్‌రెడ్డి, శ్రీనివాసులు, కిషోర్‌నాయుడు, సర్వోత్తమరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, వెంకటేశ్వర్లురాజు తదితరులు పాల్గొన్నారు.

కత్తులతో బెదిరించి..

రిటైర్డ్ ఎస్‌ఐ ఇంట్లో దోపిడీ


బీరువాలోని వస్తువులు చిందరవందరగా పడేసిన దృశ్యం

తిరుపతి క్రైం, మార్చి 15: ఎమ్మార్‌పల్లి సర్కిల్ సమీపంలోని శ్రీనగర్ కాలనీలో శుక్రవారం తెల్లవారుజామున దుండగులు రెచ్చిపోయారు. రిటైర్డ్ ఎస్‌ఐ ప్రకాష్ ఇంట్లో చోరీకి పాల్పడ్డారు. 15 సవర్ల బంగారు, 5 కేజీల వెండి వస్తువులు అపహరించుకెళ్లారు. పోలీసుల వివరాల మేరకు.. ప్రకాష్ పోలీసు శాఖలో ఎస్‌ఐగా పనిచేసి రిటైర్డ్ అయ్యారు. ఆయన ఇటీవల మృతి చెందారు. భార్య తిలకవతి ఇంట్లో ఒంటరిగా నిద్రిస్తుండగా తెల్లవారుజామున దుండగులు చొరబడ్డారు. బెడ్‌రూం తాళాలను రాడ్‌తో పగులగొట్టే ప్రయత్నం చేశారు. పెద్ద శబ్దం రావడంతో తిలకవతి నిద్ర లేచింది. దుండగులు కత్తి చూపించి ఆమెను బెదించారు. మెడలో ఉన్న నగలు, చెవిలో రింగులు, ఉంగరం, వెండి వస్తువులు తీసుకుని పారిపోయారు. తిలకవతి చుట్టుపక్కల వారికి విషయం చెప్పి ఎమ్మార్‌పల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. సీసీ ఫుటేజ్ ఆధారంగా పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. దుండగుల కోసం గాలిస్తున్నట్లు తిరుపతి రూరల్ సీఐ అహమ్మద్ చెప్పారు.

రేపు రెజ్లింగ్ బాలికల జట్టు ఎంపిక

తిరుపతి(క్రీడలు), మార్చి 15: రెజ్లింగ్ అండర్ 20 బాలికల జిల్లా జట్టును ఆదివారం ఎంపిక చేయనున్నట్లు రెజ్లింగ్ జిల్లా కమిటీ అధ్యక్షుడు ఎన్.సురేష్, కార్యదర్శి బి.ఉదయ్‌కుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. 2004, 2005, 2006సంవత్సరాలలో జన్మించిన వారు ఆధార్, పదవ తరగతి మార్కులిస్టు తీసుకురావాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 9000024837ను సంప్రదించాలని కోరారు.

టెన్త్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు



తిరుపతి(విద్య), మార్చి 15: ఈనెల 18 నుంచి ప్రారంభం కానున్న పదవ తరగతి పబ్లిక్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు డీఈవో డాక్టర్ వి.శేఖర్ పేర్కొన్నారు. జిల్లాలో 162 కేంద్రాలను ఏర్పాటు చేశామని, 30,921మంది విద్యార్థులు హాజరవుతారని వెల్లడించారు. వీరిలో రెగ్యులర్ విద్యార్థులు 27,012మంది, ప్రైవేట్ విద్యార్థులు 3,909మంది ఉన్నారని, నిర్ణీత తేదీల్లో ఉదయం 9.30-12.45గంటల వరకు పరీక్షలు జరుగుతాయని తెలిపారు. పరీక్షలను పారదర్శంగా, పటిష్టంగా నిర్వహించేందుకు 1,665మంది ఇన్విజిలేటర్లు, 162మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 162మంది డిపార్ట్‌మెంటల్ అధికారులతోపాటు 6ఫ్లైయింగ్ స్క్వాడ్‌లను నియమించినట్లు వివరించారు. కేంద్రాల వద్ద 144సెక్షన్ అమలులో ఉంటుందని తెలిపారు. విద్యార్థుల కోసం డీఈవో కార్యాలయంలో హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేస్తున్నామని, కేంద్రాల్లో ఏవైనా ఇబ్బందులు ఎదురైతే ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. అలాగే ఈ నెల18 నుంచి అదే పరీక్ష కేంద్రాల్లో ఓపెన్‌స్కూల్‌కి సంబంధించి టెన్త్, ఇంటర్ పరీక్షలు జరుగుతాయి. మధ్యాహ్నం 2.30-5.30గంటల వరకు ఈ పరీక్షలు నిర్వహిస్తారు. జిల్లాలో మొత్తం 20కేంద్రాలు ఏర్పాటు చేశారు. టెన్త్‌లో రెగ్యులర్, ప్రైవేట్ విద్యార్థులు 1,611మంది, ఇంటర్‌లో రెగ్యులర్, ప్రైవేట్ విద్యార్థులు 3,235మంది హాజరుకానున్నట్లు డీఈవో పేర్కొన్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.4.71 కోట్లు

తిరుమల, మార్చి 15(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి హుండీ ఆదాయం రూ.4.71 కోట్లు లభించింది. బుధవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన కానుకలను టీటీడీ గురువారం లెక్కించి శుక్రవారం ప్రకటించింది.

సమావేశానికి వస్తేనే చేయూత

వాకాడు, మార్చి 15: వాకాడు మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ ఆధ్వర్యంలో చేయూత చెక్కుల పంపిణీ శుక్రవారం జరిగింది. అధికార పార్టీ నేతల ఆదేశాల మేరకు ఈ సమావేశానికి వలంటీర్లు బలవంతంగా జనసమీకరణ చేసి తరలించారు. సమావేశానికి వస్తేనే చేయూత నిధులు మంజూరు చేస్తామని, లేదంటే డబ్బులు రావని వలంటీర్లు లబ్ధిదారులకు చెప్పారు. వ్యవసాయం, ఇతర పనులు ఉన్నాయని చెప్పినా, వినకుండా ఇంటింటికీ వెళ్లి బలవంతంగా మహిళలను సమావేశానికి ఆటోల్లో తరలించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీలు రౌతు రామకృష్ణ, సింగిల్‌విండో ఛైర్మన్ కొడవలూరు భక్తవత్సల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనల అమలు పట్ల

అప్రమత్తంగా వ్యవహరించాలి

కోట, మార్చి 15: ఎన్నికల నిబంధనల అమలు పట్ల అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని తహసీల్దారు నాగరాజురావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎన్నికల నిబంధనలపై వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష జరిపారు. మరి కొన్నిగంటల్లో ఎన్నికల కోడ్ రానున్న నేపథ్యంలో అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, ప్రాంగణాలు, బహిరంగ ప్రాంతాల్లో సంక్షేమ పథకాల పోస్టర్లపై నిఘా పెట్టాలన్నారు. ఎంపీడీవో శంకరయ్య, ఇతర అధికారులు పాల్గొన్నారు.

టీడీపీ గెలుపుకోసం కలసికట్టుగా కృషి


ఆదిమూలాన్ని సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

నారాయణవనం, మార్చి 15: టీడీపీ గెలుపుకోసం కలసికట్టుగా కృషి చేద్దామని సత్యవేడు ఎమ్మెల్యే అభ్యర్థి కోనేటి ఆదిమూలం పేర్కొన్నారు. మండలంలోని టీడీపీ నాయకులు శుక్రవారం స్థానిక హరిఫంక్షన్ హాల్‌లో ఆదిమూలంను కలిసి పూలమాలలు, శాలవాలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి బాధ్యతను అప్పగించిన నారా చంద్రబాబుకు, నారా లోకేశ్ రుణపడి ఉంటానని తెలిపారు. నియోజకవర్గంలో టీడీపీని గెలిపించడానికి కలిసి కట్టుగా కృషి చేద్దామని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు భాస్కరన్, గోవిందస్వామి, కేఎస్.రవి, సుబ్రహ్మణ్యం, హరి, మాణిక్యంరెడ్డి, వేలురెడ్డి, రాజశేఖర్, దొరవేలు రెడ్డి, లోకనాదం, మురుగేశ్‌రెడ్డి, పురుషోత్తం, రఘుపతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలో చేరికలు


టీడీపీలో చేరిన టీసీ అగ్రహారం నాయకులతో భానుప్రకాష్

వడమాలపేట, మార్చి 15: మండలంలోని టీసీ అగ్రహారం గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు టీడీపీలో చేరారు. టీడీపీ మండల ఉపాధ్యక్షుడు రవిరెడ్డి, యూనిట్ ఇన్‌చార్జి ధనంజయులు నాయుడు ఆధ్వర్యంలో 30 మంది వైసీపీ నాయకులు శుక్రవారం నగరి నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భానుప్రకాష్‌ను తిరుపతిలోని ఆయన నివాసంలో కలిశారు. టీడీపీ గెలుపునకు నిస్వార్థంగా కృషి చేస్తామని చెప్పారు. వారిని భానుప్రకాష్ టీడీపీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా భానుప్రకాష్ మాట్లాడుతూ వడమాలపేట మండలంలో టీడీపీకి పూర్వవైభవం తీసుకురావడానికి కృషి చేయాలని కోరారు. టీడీపీలో చేరిన వారిలో భాస్కర్ రెడ్డి, మునిరెడ్డి, రామారావు, మునీంద్ర, సుబ్రమణ్యం రెడ్డి, ఏ.మునిరెడ్డి, సురేంద్ర, మునిరాజ ఉన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు వెంకటరమణ, కృష్ణారెడ్డి, నాదవేలురెడ్డి, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

పుత్తూరు అర్బన్: మున్సిపాలిటీ పరిధిలోని చెర్లోపల్లెకు చెందిన వైసీపీ నాయకులు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. మాజీ సర్పంచు రంగారెడ్డి కుమారుడు చంగారెడ్డి, చెల్లగొల్ల శివయ్య నగరి ఎమ్మెల్యే అభ్యర్థి భానుప్రకాష్ సమక్షంలో టీడీపీ కండువాలు కప్పుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు గాలి జీవరత్నం నాయుడు, ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు ఆనంగి ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

పుత్తూరు వార్తలు

వేడుకగా పద్మావతమ్మ ఊంజలసేవ



నారాయణవనం, మార్చి 15: నారాయణవనంలో వెలసిన కల్యాణ వెంకన్న ఆలయంలో పద్మావతి అమ్మవారి ఊంజల సేవను శుక్రవారం వేడుకగా నిర్వహించారు. ఉదయం స్వామి, పద్మావతి అమ్మవార్లకు శుక్రవారం సందర్భంగా ఉదయం నిత్య కైంకర్యాలు నిర్వహించి, ప్రత్యేక అభిషేకాలు చేపట్టారు. సాయంత్రం అమ్మవారికి నూతన పట్టు వస్త్రాలు, ప్రత్యేక పుష్పాలతో అలంకరించి, వేద పండితుల మంత్రోచ్చారణతో ఊంజల సేవ నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు శ్రీధర్ భట్టాచార్య, శ్రీనివాసరాఘవ భట్టాచార్య, ఆలయాధికారి నాగరాజు సిబ్బంది పాల్గొన్నారు.

పాముకాటుకు గురైన మహిళ మృతి


కుప్పమ్మ (ఫైల్‌ఫోటో)

నారాయణవనం, మార్చి 15: మండల పరిధిలోని కొత్త కోట వీధిలో నివాసం ఉంటున్న అరుణాచలం మొదలి భార్య కుప్పమ్మ పాము కాటుకు గురై మృతి చెందింది. బంధువుల కథనం మేరకు... ఈనెల 10వ తేదీన కుప్పమ్మ పొయ్యికి కట్టెలు తీసుకొచ్చేందుకు వెళ్లగా పాముకాటు వేసింది. స్థానికులు ఆమెను వెంటనే పుత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రథమి చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం చెన్నైలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం సాయంత్రం మృతి చెందింది. ఎస్‌ఐ లక్ష్మీనారాయణ కేసు నమోదు చేశారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

పుత్తూరు, మార్చి 15: నియోజకవర్గంలోని 64మందికి సీఎం సహాయనిధి నుంచి మంజూరైన రూ.45 లక్షల 74 వేల చెక్కులను మంత్రి రోజా శుక్రవారం లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలోనే కాకుండా ఇతర రాష్ట్రాల్లో వైద్యం చేసుకునే వారికి ఆరోగ్యశ్రీ కింద ఉచిత వైద్య సదుపాయాలను కల్పిస్తున్నామని తెలిపారు.

టీడీపీతోనే అన్ని వర్గాల అభివృద్ధి: భానుప్రకాష్


నందిమంగళం దళితవాడలో ప్రచారం నిర్వహిస్తున్న భానుప్రకాష్

పుత్తూరు అర్బన్, మార్చి 15: సమాజంలోని అన్ని వర్గాల అభివృద్ధి టీడీపీతోనే సాధ్యమని నగరి ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భానుప్రకాష్ స్పష్టం చేశారు. శుక్రవారం మున్సిపల్ పరిధిలోని నందిమంగళం దళితవాడలో సూపర్ సిక్స్ పథకాలపై ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన స్థానికులతో మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక దళితుల జీవితాలు దుర్భరంగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రభుత్వంలో దళితులపై జరిగినన్ని దాడులు, హత్యలు మరే ప్రభుత్వ హయాంలో జరగలేదని ధ్వజమెత్తారు. ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులను సైతం దారిమళ్లించి దళితుల అభివృద్ధిని అడ్డుకున్న జగన్ ప్రభుత్వాన్ని బంగాళాఖాతంలో కలిపేయాలని పిలుపునిచ్చారు. దళితులను మభ్యపెట్టి ఓట్లు వేయించుకుని గెలిచిన జగన్ ప్రభుత్వంకు బుద్ధి చెప్పే రోజు వచ్చిందన్నారు. పేదలందరికీ సొంత ఇళ్లు ఉండాలనే లక్ష్యంతో నిర్మించిన టిడ్కో గృహాలు టీడీపీ ప్రభుత్వ హయాంలో 90 శాతం పూర్తి కాగా మిగిలిన పది శాతం పూర్తి చేయకుండానే ఐదేళ్ల పాలన ముగించిన దుర్మార్గపు వైసీపీ ప్రభుత్వాన్ని తరిమికొట్టాలన్నారు. ఓట్ల కోసం వైసీపీ నాయకులు వస్తే టిడ్కో ఇళ్లు ఎందుకు పూర్తి చేయలేదని నిలదీయాలని సూచించారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అధికారంలోకి రావడం ఖాయమని దళితవాడల్లో అభివృద్ధి, ఉపాధి, ఉద్యోగ అవకాశాల కల్పనతో పాటు వారికి వ్యక్తిగతంగా తాను అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా ప్రచారంకు వచ్చిన భానుప్రకాష్‌కు దళితవాడలో అపూర్వ స్వాగతం లభించింది. వీధులను పసుపు తోరణాలతో అలంకరించారు. మహిళలు ప్రతి ఇంటి వద్ద మంగళహారతులిచ్చి బ్రహ్మరథం పట్టారు. కార్యక్రమంలో యూనిట్ ఇన్‌చార్జి చెంగమనాయుడు బాబునాయుడు, టౌన్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు వేలు, మురగన్, సెల్వరాజ్, నాగూర్, చిన్నబ్బ, మణి, వేలు, విజయ్, కరీం, పట్టణ అధ్యక్షుడు గాలి జీవరత్నంనాయుడు, ప్రధాన కార్యదర్శి ఎన్ఎన్ ధనపాల్, జనసేన నియోజకవర్గ సమన్వయకర్త మహేష్, సురేష్‌బాబు, మునస్వామి, రాజేష్ పాల్గొన్నారు.

కమ్మ భవన్ నిర్మాణానికి ఇందుశేఖర్ భారీ విరాళం


కొల్లూరి ఇందుశేఖర్ దంపతులకు కమ్మ సంఘ ప్రతినిధుల సత్కారం

తిరుపతి (కొర్లగుంట), మార్చి 15: తిరుపతి సమీపంలోని వకుళమాత ఆలయం దగ్గర తిరుపతి కమ్మవారి అభ్యుదయ సంక్షేమ సంఘం నిర్మించతలపెట్టిన అంతర్జాతీయ కమ్మ భవనం నిర్మాణానికి చంద్రగిరి టీడీపీ నేత కొల్లూరి ఇందుశేఖర్ రూ.కోటిన్నర విరాళం ప్రకటించారు. తన తాత, చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే మేడసాని వెంకటరామానాయుడు అలియాస్ మీసాల నాయుడు పేరిట రూ.కోటితో కన్వెన్షన్ హాలు, తన తండ్రి కొల్లూరి మోహన్ నాయుడు పేరిట రూ.50 లక్షలతో భోజనశాల నిర్మించాలని ఆయన సంఘ నిర్వాహకులను కోరారు. అంతర్జాతీయ కమ్మ భవన నిర్మాణానికి భారీ విరాళం ప్రకటించిన నేపథ్యంలో శుక్రవారం కమ్మ సంఘం అధ్యక్షులు పులిపాటి పురంధరనాయుడు, ఆర్గనైజింగ్ కార్యదర్శి వేమూరి జయరాం ప్రసాద్, ఉపాధ్యక్షుడు రామచంద్ర నాయుడు, సభ్యుడు లీలాకృష్ణమ నాయుడు తదితరులు కొల్లూరు ఇందుశేఖర్ దంపతులను వారి నివాసంలో ఘనంగా సత్కరించారు.

ప్రీమెట్రిక్ స్కాలర్‌షిప్‌కు ఏప్రిల్ 10న ఆఖరు

తిరుపతి (రవాణా), మార్చి 15: ప్రీమెట్రిక్ స్కాలర్‌షిప్‌నకు ఏప్రిల్ 10వ తేదీలోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని జిల్లా ఎస్సీ సంక్షేమ. సాధికారత అధికారి యు.చెన్నయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేటు గుర్తింపు పొందిన పాఠశాలల్లో చదివే మాన్యువల్ స్కావెంజర్స్(అపరిశుభ్ర పనిలో జీవించే వారు), చర్మకారులు, ప్లేయర్స్, వేస్ట్ పిక్కర్స్(వ్యర్థాలను సేకరించేవారు), హజార్డౌస్ క్లీనింగ్ (ప్రమాదకర పరిసరాలను శుభ్రపరచడంలో నిమగ్నమైన) పిల్లలు అర్హులని పేర్కొన్నారు. 1నుంచి 10వ తరగతి విద్యార్థులకు(డే స్కాలర్) రూ.3 వేలు, హాస్టల్ వసతి పొందే వారికి రూ.8 వేలు మంజూరు చేస్తారని పేర్కొన్నారు. అర్హత కలిగిన విద్యార్థులు సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు.

19న ముగియనున్న రీసెట్ దరఖాస్తు గడువు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 15: రాష్ట్రంలోని యూనివర్సిటీల్లో ఖాళీగా ఉన్న పీహెచ్‌డీ సీట్ల భర్తీకి చేపట్టే ఏపీ రీసెట్ 2023-24 దరఖాస్తు గడువు ఈనెల 19వ తేదీతో ముగియనుంది. ఆసక్తి గల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఏపీ రీసెట్ కన్వీనర్ ప్రొఫెసర్ దేవప్రసాదరాజు కోరారు.

పోలీసుల అదుపులో

పాదరక్షల దొంగ

తిరుమల, మార్చి15(ఆంధ్రజ్యోతి): తిరుమలలో భక్తుల పాదరక్షలను(చెప్పులు) దొంగలించే వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. శుక్రవారం ఉదయం కల్యాణకట్ట ప్రాంతంలో అనుమానితంగా తిరుగుతున్న ఓ యువకుడిని విజిలెన్స్ సిబ్బంది అదుపులోకి తీసుకున్నారు. అతని వద్దనున్న బ్యాగ్‌ను తనిఖీ చేయగా దాదాపు 30 జత పాదరక్షలు ఉన్నట్టు గుర్తించారు. వెంటనే క్రైం పోలీసులకు అప్పగించారు. ఐదు మంది బృందాలుగా విడిపోయి క్యూలైన్లు, కాటేజీలు, కార్యాలయాలు, కల్యాణకట్టలు, ఆలయ పరిసర ప్రాంతాల్లో భక్తులు విడిచిపెట్టే ఖరీదైన చెప్పులను దొంగించి ఇతర ప్రాంతాల్లో విక్రయిస్తున్నట్టు విచారణలో తేలింది. మిగిలిన వారిని కూడా పట్టుకునేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు.

శ్రీకాళహస్తి
సత్యవేడు

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం



శ్రీకాళహస్తి, మార్చి 15: ముక్కంటి ఆలయంలో నిర్వహించే నిత్యాన్నదాన పథకానికి తిరుపతికి చెందిన నిర్మల లక్ష రూపాయలు విరాళం అందించారు. శుక్రవారం ఆమె తన కుమారుడు నీహార్‌తో కలిసి ఆలయ పరిపాలన భవనంలో చైర్మన్ అంజూరు శ్రీనివాసులును కలిసి చెక్కును అందజేశారు. దాతలకు ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు.

రాజులపాళెంలో సిపాయి భరోసా అందజేత

ఏర్పేడు, మార్చి 15: రాజులపాళెం గ్రామానికి చెందిన ధనంజయ (48) పది రోజుల క్రితం అనారోగ్యంతో మృతిచెందాడు. ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యం శుక్రవారం ధనంజయ కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారి కుటుంబానికి 42 రకాల నిత్యావసర సరు కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు డాక్టర్ వెంక టాద్రి, డాక్టర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

వరదయ్యపాళెం, మార్చి 15: వరదయ్యపాళెం మండల సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ సుబ్రహ్మణ్యం తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. సబ్ స్టేషన్ మరమ్మతులు, విద్యుత్ స్తంభాల వద్ద చెట్ల తొలగింపు వంటి పనుల కారణంగా ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని వివరించారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

పాఠశాలకు ప్రింటర్ వితరణ



తొట్టంబేడు, మార్చి 15: శ్రీకాళహస్తి మండలంలోని ఊరందూరు గ్రామంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదు వుతున్న విద్యార్థులు తమ పాఠశాలకు శుక్రవారం ప్రింటర్ వితరణగా అందించారు. హెచ్ఎం రాజకుమారి విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సురేష్, శాంతి, రమేష్‌రెడ్డి, మల్లి కార్జున, రజియా, మురళి, అనూష, హిమ బిందు, విద్యార్థులు పాల్గొన్నారు.

వ్యవసాయ కార్మిక సంఘం నేత తల్లికి టీడీపీ నివాళి

ఏర్పేడు, మార్చి 15: చిందేపల్లి గ్రామానికి చెందిన వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు తలారి బాలకృష్ణ మాతృమూర్తి పాపమ్మ(98) శుక్రవారం మృతిచెందారు. టీడీపీ సీనియర్ నాయకులు బొల్లినేని జగన్నాథం నాయుడు ఆమె మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయనతో పాటు పలువురు టీడీపీ నాయకులు అంజలి ఘటించారు.

చంద్రప్రభ వాహనంపై చక్రధరుడు



తొట్టంబేడు, మార్చి 15: శ్రీకాళహస్తి మండలంలోని తొండమాన్‌పురంలో వెలసిన శ్రీదేవి భూదేవి సమేత ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా శుక్రవారం స్వామివారు చంద్రప్రభ వాహనంపై పురవీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించారు. భక్తులు కర్పూర హారతులు సమర్పించారు.

ఎంపీడీవో బాధ్యతల స్వీకరణ



బుచ్చినాయుడుకండ్రిగ, మార్చి 15: మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా ప్రతాప్‌రెడ్డి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. కేవీబీపురం మండలంలో ఏవోగా పనిచేస్తున్న ప్రతాప్‌రెడ్డి ఇన్‌చార్జి ఎంపీడీవోగా బాధ్యతలు చేపట్టారు. కాగా ఇక్కడ పనిచేస్తున్న ఎంపీడీవో షాలేట్ నిమ్మనపల్లి మండలానికి బదిలీ అయ్యారు.

దళితుల సాగుభూములకు పట్టాలివ్వాలి: సీపీఐ



బుచ్చినాయుడుకండ్రిగ, మార్చి 15: మండలంలోని వీఎస్‌పురం దళి తులు సాగుచేస్తున్న భూములకు పట్టాలివ్వాలని సీపీఐ మండల కార్యదర్శి ధర్మయ్య డిమాండ్ చేశారు. సీపీఐ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట శుక్రవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ సర్వే నెంబర్లు 340, 341లోని 50 ఎకరాల భూము లను దళితులు 50 సంవత్సరాలుగా సాగుచేసుకుంటున్నారని వారికి పట్టాలు ఇవ్వాలని కోరారు. తహసీల్దార్ మహ్మద్ ఆలీఖాన్‌కు వినతిపత్రం అందజేశారు.

అమరరాజాలో ఉద్యోగులకు 5కే రన్



5కే రన్‌ను జెండా ఊపి ప్రారంభిస్తున్న దృశ్యం

రేణిగుంట, మార్చి 15: అమరరాజా ఉద్యోగులకు 5కే రన్‌ను నిర్వహించారు. శుక్రవారం అమరరాజా ప్రాంగణంలో 'మా ఆరోగ్యం మా బాధ్యత' అనే నినాదంతో ఈ రన్ నిర్వహించారు. 500మంది ఉద్యోగులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ముందుగా డాక్టర్ సురేష్, హెచ్ఆర్ శేఖర్, మేనేజరు జయ కుమార్ జెండా ఊపి కార్యక్రమాన్ని ప్రారంభించారు. జనరల్ మేనేజరు నళినికుమార్, సర్వీస్ మేనేజరు లోకా రామానాయుడు పాల్గొన్నారు.


ప్రజల్లో వ్యతిరేకత ఉన్న వ్యక్తికి టికెట్ ఎలా ఇస్తారు?

వరదయ్యపాళెం, మార్చి 15: వైసీపీ ఎమ్మెల్యేగా ఎన్నో అవినీతి ఆరోపణలు ఉన్న వ్యక్తికి సత్యవేడు టీడీపీ టికెట్ ఎలా ఇస్తారని టీడీపీ మండలాధ్యక్షుడు యుగంధర్‌రెడ్డి ప్రశ్నించారు. వరదయ్యపాళెంలో ఆయన తన నివాసంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఇందులో ఆయన మాట్లాడుతూ క్లిష్ట సమయంలో పార్టీకి అండగా ఉన్న వారిని కాదని స్వార్థం కోసం రంగుమార్చిన వ్యక్తికి ఎమ్మెల్యే టికెట్ వ్వడం న్యాయం కాదన్నారు. దీనిపై అధిష్ఠానం పునరాలోచించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు నిర్మల్‌కుమార్, సురేష్‌రెడ్డి, వెంకటేష్, నరసరాజు, అభిరామ్ చౌదరి, అయ్యప్పరెడ్డి, రఘు, ఎన్టీఆర్ వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

వినుతకు టికెట్ కేటాయించాలి

శ్రీకాళహస్తి, మార్చి 15: శ్రీకాళహస్తి ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థిగా జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి వినుతకు అవకాశం ఇవ్వాలని ఆ పార్టీ కార్యకర్తలు నిరసన వ్యక్తం చేశారు. పట్టణంలోని పెళ్లి మండపం కూడలి వద్ద శుక్రవారం రాత్రి వినుతకు మద్దతుగా ప్ల కార్డులు, కొవ్వొత్తులతో నిరసన తెలిపారు.

కష్టపడిన వారికే టిక్కెట్టు ఇవ్వాలి



నిరసన తెలుపుతున్న నాయకులు

వరదయ్య పాళెం, మార్చి 15: మొదటి నుంచి పార్టీ కోసం కష్టపడిన వారికే టిక్కెట్టు ఇవ్వాలని టీడీపీ నాయ కులు కోరారు. సత్యవేడు టీడీపీ టిక్కెట్ ఎమ్మెల్యే ఆదిమూలానికి ఇవ్వడంపై శుక్రవారం వరదయ్యపాళెం బస్టాండు వద్ద వరదయ్యపాళెం, బుచ్చినాయుడు కండ్రిగ మండలాల నాయకులు నిరసన తెలిపారు. అధిష్ఠానం పునరాలోచన చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు నాగరాజుయాదవ్, మల్లికార్జునచౌదరి, బుచ్చినాయుడుకండ్రిగకు చెందిన ఆదెయ్య పాల్గొన్నారు.

పెద్దమనసుతో ఆశీర్వదించండి



సతీష్‌నాయుడుతో ఎమ్మెల్యే ఆదిమూలం

పిచ్చాటూరు, మార్చి 15: పరిస్థితుల ప్రభావంతో గతంలో పార్టీ మారి ఇప్పుడు సొంతగూటికి చేరిన తనను పెద్దమనసుతో టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఆశీర్వదించాలని ఎమ్మెల్యే ఆదిమూలం కోరారు. శుక్రవారం పలువురు టీడీపీ నేతల ఇళ్లకు వెళ్లి వారి మద్దతు కోరారు. కీళపూడి మాజీ ఎంపీపీ మధుబాల భర్త పద్మ నాభరాజు, వేలూరులో తిరుపతి జిల్లా ఉపాధ్యక్షుడు సతీష్ నాయుడు, సీనియర్ నాయకులు ప్రభాకర్‌నాయుడు, మాజీ జడ్పీటీసీ సుమాంజలి, రామగిరి టీడీపీ యువజన నాయకులను మర్యాదపూర్వకంగా కలసి శాలువలతో సన్మానించారు.

విద్యార్థులకు ప్యాడ్ల పంపిణీ

శ్రీకాళహస్తి, మార్చి 15: శ్రీకాళహస్తిలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలోని పదో తరగతి విద్యార్థులకు ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి సతీమణి శ్రీవాణిరెడ్డి శుక్రవారం ప్యాడ్లు వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి మార్కెట్ కమిటీ చైర్మన్ మధురెడ్డి, మున్నా, దామోదర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయం ప్రారంభం

పట్టణంలోని పంచాయతీరాజ్ అతిథి గృహం పక్కనే ఇటీవల నిర్మించిన నూతన గ్రంథాలయ భవనాన్ని శ్రీవాణిరెడ్డి ప్రారంభించారు. వైసీపీ నాయకులు వయ్యాల కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోండి



శ్రీకాళహస్తి, మార్చి 15: అందరూ స్వేచ్ఛగా ఓటు హక్కును వినియో గించుకోవాలని పోలీసు అధికారులు పిలుపునిచ్చారు. రానున్న సార్వత్రిక ఎన్నికలను పురస్కరించుకుని శుక్రవారం శ్రీకాళహస్తిలో కేంద్ర బలగాలు కవాతు నిర్వహించాయి. పట్టణంలోని ఏపీ సీడ్స్ కూడలి నుంచి ఆర్టీసీ వరకు భద్రతా సిబ్బంది కవాతు చేశారు.

20న హుండీ లెక్కింపు

శ్రీకాళహస్తి, మార్చి 15: శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఈ నెల 20వ తేదీన హుండీ లెక్కింపు నిర్వహించనున్నట్లు ఈవో నాగేశ్వరరావు శుక్రవారం ప్రకటనలో తెలిపారు.

ఆర్‌బీకేలో ఈ-క్రాప్ ధ్రువపత్రాలు

ఏర్పేడు, మార్చి 15: ఏర్పేడు మండలంలో రబీ 2023-24 సీజన్‌లో 4,826 మంది రైతులకు చెందిన 8,729 ఎకరాల పంటల సాగు వివరాలను ఈ-క్రాప్‌లో నమోదు చేసినట్లు వ్యవసాయాధికారులు తెలిపారు. దీనికి సంబంధించిన పత్రాలు రైతుభరోసా కేంద్రాల్లో ఉంచామని రైతులు తీసు కెళ్లాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో చండీ యాగం

రేణిగుంట, మార్చి 15: రేణిగుంటలోని జీఎం వీధిలో ఉన్న రాజగణపతి వినాయక ఆలయంలో మహానవ చండీ యాగం శుక్రవారం నిర్వహించారు. రాజ గణపతి సేవా కమిటీ ఆధ్వర్యంలో ఉదయం ఆలయ ప్రాంగణంలో గోపూజ, దేవత అనుజ్ఞ, విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనం, రాజా గణపతి కలశస్థాపన, హోమం, పూర్ణాహుతి నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

సైనిక్ ప్రవేశ పరీక్షలో అయాన్ ప్రతిభ



శ్రీకాళహస్తి, మార్చి 15: సైనిక్ ప్రవేశ పరీక్షలో శ్రీకాళహస్తికి చెందిన షేక్ అయాన్ సత్తా చాటాడు. పట్టణంలోని ఎస్వీ సైనిక్ అకాడమీలో శిక్షణ పొందిన అయాన్ రాష్ట్ర స్థాయిలో 4వ ర్యాంకు, జాతీయ స్థాయిలో 377వ ర్యాంకు సాధించాడు. ప్రతిభ చూపిన విద్యార్థిని అకాడమీ నిర్వాహకులు, పలువురు అభినందించారు.

మద్యం సీసాల స్వాధీనం

ఏర్పేడు, మార్చి 15: ఏర్పేడు మండలంలోని పాయల్‌సెంటర్‌లో అక్రమంగా మద్యం అమ్ముతున్న భానుమతి అనే మహిళ నుంచి 11 మద్యం సీసాలను ఏర్పేడు ఎస్ఐ జిలానీ స్వాధీనం చేసు కున్నారు. ఆమెపై కేసు నమోదు చేశారు.

4,430 కిలోల రేషన్‌బియ్యం స్వాధీనం

ఏర్పేడు, మార్చి 15: ఆటోలో రేషన్‌బియ్యం తరలిస్తున్న ఇద్దరిని సివిల్ సప్లైస్ అధికారులు గురువారం పట్టుకున్నారు. వారి నుంచి 4,430 కిలోల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఆమందూరు గ్రామానికి చెందిన చంటి, రేణిగుంట మండలం దొడ్లమిట్టకు చెందిన రామంజనేయులుపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ దాడుల్లో డీటీ తిరుమలేశ్వరి పాల్గొన్నారు.

జనరల్ స్టోర్‌లో చోరీ

ఏర్పేడు, మార్చి 15: ఏర్పేడు మండలం పల్లం పంచాయతీ పల్లంపేట గ్రామంలో ని ఓ జనరల్ స్టోర్‌లో గురువారం రాత్రి గుర్తుతెలియని దుండగులు చోరీ చేశారు. రూ.52 వేలు నగదు, రూ.2వేలు విలువ చేసే వస్తువులను దోచుకెళ్లారు. శుక్రవారం ఉదయం దుకాణం యజమాని భక్తవత్సలం గుర్తించాడు. ఏర్పేడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్ఐ కేసు నమోదు చేసుకుని దర్యాప్తుచేస్తున్నారు.

నృత్యం..మంత్రముగ్ధం

తొట్టంబేడు, మార్చి 15: రాష్ట్రపతి అవార్డు గ్రహీత, కర్నూలు జిల్లా నందికొట్కూరుకి చెందిన సాయిలిక్షితాశ్రీ నృత్యాభినయం ఆహూతులను మంత్ర ముగ్ధం చేసింది. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలలో భాగంగా శుక్రవారం శ్రీకాళహస్తి పట్టణంలోని స్వర్ణముఖి నదీతీరాన ఏర్పాటు చేసిన ధూర్జటి కళా ప్రాంగణంలో జరిగిన ముంబయికి చెందిన నరేష్ పిళ్లై బృందం నృత్యరూపక ప్రదర్శనలు, ఒంగోలుకి చెందిన శివకుమారి బృందం నళినిప్రియ కూచిపూడి నృత్యం భక్తులను అలరించింది. కళాకారులను దేవస్థానం అధికారులు దుశ్శాలువాతో సత్కరించి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.





నరేష్ పిళ్లై నృత్యరూపక ప్రదర్శన, సాయిలిక్షితాశ్రీ నృత్యార్చన

శివరాత్రి ఉత్సవాలు విజయవంతం



సమావేశంలో మాట్లాడుతున్న అంజూరు శ్రీనివాసులు

శ్రీకాళహస్తి, మార్చి 15: సమష్టి కృషితో మహాశివరాత్రి ఉత్సవాలను విజయవంతం చేశామని ముక్కంటి ఆలయ చైర్మన్ అంజూరు శ్రీనివాసులు తెలిపారు. ధూర్జటి కళా ప్రాంగణంలో శుక్రవారం ఉత్సవాల ముగింపు సందర్భంగా అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయ వ్యవస్థతోపాటు పలు ప్రభుత్వ శాఖల సమన్వయంతో 13 రోజులపాటు ఉత్సవాలు ఎంతో వైభవంగా జరిగాయ న్నారు. ఉత్సవాల్లో భాగస్వాములైన అన్ని శాఖల అధికారులు, ఉద్యోగులు, సిబ్బందిని శేష వస్త్రంతో ఘనంగా సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి ఆర్డీవో రవిశంకర్‌రెడ్డి, డీఎస్పీ ఉమా మహేశ్వర రెడ్డి, ఈవో నాగేశ్వరరావు, పురపాలక సంఘం కమిషనర్ రమేష్ బాబు పాల్గొన్నారు.

లింగ వివక్ష అంతరించాలి



కేక్ కట్ చేస్తున్న మహిళా వర్కర్లు

శ్రీకాళహస్తి, మార్చి 15: సమాజంలో లింగ వివక్ష అంత రించి అన్ని రంగాల్లో స్త్రీ, పురుష సమానత్వం రావాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు అంగేరి పుల్లయ్య కోరారు. స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవన్‌లో శుక్రవారం సీఐటీయూ అనుబంధ ఆర్టీసీ మహిళా విభాగం వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన పుల్లయ్య ముందుగా కేక్ కట్ చేసి మహిళా ఉద్యోగులకు మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ పాలనలో సమాజంలో మనువాద పోకడలు పెచ్చుమీరా యని, మహిళలకు రక్షణ లేకుండా పోయిందని పేర్కొన్నారు. సీఐటీయూ నాయకులు పెనగడం గురవయ్య, గంధం మణి పాల్గొన్నారు.

ఘనంగా సరస్వతి పూజ

బుచ్చినాయుడుకండ్రిగ, మార్చి 15: మండలంలోని నెలవాయి ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులు సరస్వతి పూజను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు రాజశేఖర్ మాట్లాడుతూ ప్రణాళికాబద్ధంగా చదివి అందరూ మంచి మార్కులతో ఉత్తీర్ణులు కావాలని కోరారు. పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని కోరారు.

ఇండిపెండెంట్‌గా బరిలోకి దిగుతా : జేడీఆర్

సత్యవేడు, మార్చి 15: సత్యవేడు టీడీపీ అభ్యర్థిగా వైసీపీ రెబల్ ఎమ్మెల్యే ఆదిమూలం పేరును ప్రకటించడంపై పార్టీ నేత జేడీ రాజశేఖర్ ధిక్కార స్వరం వినిపించారు. సత్యవేడు టీడీపీ టికెట్ తనకు ఇవ్వకుంటే ఇండిపెండెంట్‌గా పోటీ చేస్తానని ఆయన ప్రకటించారు. చంద్రబాబు, లోకేశ్ బొమ్మలతోనే ప్రజల్లోకి వెళ్లి గెలిచి, పార్టీలోనే ఉంటానన్నారు. తిరుపతిలోని ఆయన ఇంట్లో కుటుంబ సభ్యులతో కలిసి మీడియాతో మాట్లాడుతూ... 2019 ఎన్నికల్లో ఓటమి చెందినా నిరాశ పడకుండా పార్టీకి సేవ చేశానని తెలిపారు. టీడీపీ కార్యకర్తల పైన, నాయకులపైన ఎన్నో కేసులు పెట్టి ఇబ్బందులకు గురిచేసిన ఆదిమూలానికి టికెట్ ఇవ్వడం ధర్మమా అని ప్రశ్నించారు. జేడీఆర్ కుమార్తె మౌనిక మాట్లాడుతూ చంద్రబాబు పునరాలోచించి తమకు న్యాయం చేయాలని కోరారు. కాగా తాజా పరిణామాలపై నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జ్ డా.హెలెన్ ఎలాంటి ప్రకటన చేయలేదు. శనివారం శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీ నాయుడు ఇంట్లో అసమ్మతి నేతల సమావేశం జరగనున్నట్లు సమాచారం. మాజీ ఎమ్మెల్యేలు మునిరామయ్య, హేమలత, ఇన్‌చార్జ్ హెలెన్ పాల్గొనబోతున్నట్లు తెలిసింది. ఈ సమావేశంలో భవిష్యత్ రాజకీయ కార్యాచరణపై చర్చించి, కీలక ప్రకటన చేయనున్నట్లు సమాచారం.

టీడీపీలో పలువురి చేరిక



ఏర్పేడు/శ్రీకాళహస్తి మార్చి 15: ఏర్పేడు మండలం సీతారాం పేట నుంచి యువత భారీ ఎత్తున ప్రకాష్ యాదవ్ ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జల సుధీర్‌రెడ్డి వారికి పసుపు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో కుమార్, పవన్, లక్ష్మీనారాయణ, గురుప్రసాద్, ధనుష్, సాయి, నాని, పవన్, సుబ్రహ్మ ణ్యం, చైతు, చరణ్, రాహుల్, ప్రతాప్, మునిసాహిత్, చంద్ర, నవీన్ తదితరులు ఉన్నారు. ● రంజాన్ మాసం పురస్కరించుకుని పట్టణంలోని యూసఫ్ మసీదులో ప్రార్థనలకు బొజ్జల సుధీర్ రెడ్డి హాజరయ్యారు. ముస్లిం మత పెద్దల నుంచి ఆశీస్సులు పొందారు.

వైసీపీ అభ్యర్థికి అసమ్మతి సెగ



బుజ్జగిస్తున్న వైసీపీ అభ్యర్థి రాజేష్

వరదయ్యపాళెం, మార్చి 15: వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నూకతోటి రాజేష్ ప్రచారానికి ఆదిలోనే అసమ్మతి ఎదురైంది. మండలంలో తొలి సారిగా రాజేష్ ప్రచారానికి వచ్చారు. కురుంజలం పర్యటన అనంతరం ఇందిరానగర్ పంచాయతీ ఎస్టీకాలనీలో పర్యటించాల్సి ఉంది. అయితే కాలనీలోకి వెళ్లకుండా ముందుగా సర్పంచ్ ఇంటికి వెళ్లి తరువాత వస్తామని వాహనాన్ని మళ్లించారు. దీంతో పార్టీ మండల ప్రధాన కార్యదర్శి సునీల్ అక్కడి నాయకుల తీరుపై మండిపడ్డారు. కాలనీకిలో రాకుండా వెళ్లిపోతే ఎలాగని ప్రశ్నించారు. ఎస్సీ, ఎస్టీల ఓట్లు అవసరం లేదనుకుంటే మళ్లీ ఇక్కడికి రాకండి అంటూ రాజేష్ సమక్షంలోనే వైసీపీ నాయ కులను నిలదీశాడు. దీంతో రాజేష్ వాహనం దిగి సునీల్‌ను బుజ్జగించాడు. అక్కడ ఎస్టీల చేత హారతులు, సన్మానం తర్వాత సర్పంచ్ వీరభద్రం ఇంటికి వెళ్లారు.

జోరుగా ప్రచారం

వైసీపీ సత్యవేడు ఎమ్మెల్యే అభ్యర్థి నూకతోటి రాజేష్ మండలంలో పలు గ్రామాల్లో ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు దయాకర్‌రెడ్డి, తిలక్, సునీల్, చిన్నా, వినోద్‌యాదవ్, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీవీ ఇంట నేడు అసమ్మతి సమావేశం?

● హాజరుకానున్న రెండు నియోజకవర్గాల నేతలు

శ్రీకాళహస్తి, మార్చి 15: తెలుగుదేశం నాయకుడు ఎస్సీవీ ఇంటివద్ద శనివారం ఉదయం సమావేశం అవుదామంటూ ఒక సమాచారం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. శ్రీకాళహస్తి టీడీపీ అభ్యర్థిగా బొజ్జల సుధీర్‌రెడ్డిని ప్రకటించిన నేపథ్యంలో సత్యవేడు, శ్రీకాళహస్తి నియోజకవర్గాల్లోని కొందరు నాయకులు ఈ సమావేశానికి హాజరవుతున్నట్టు చెబుతున్నారు. ఇదే సమయంలో ఎస్సీవీ నాయుడుకు కాంగ్రెస్ పార్టీలో చేరమంటూ ఆహ్వానం వచ్చినట్టు తెలుస్తోంది. గతంలో చింతామోహన్‌కి సన్నిహి తుడైన ఈయనను చింతాతో పాటూ షర్మిల కూడా ఆహ్వానించారని ప్రచారం జరుగుతోంది. శుక్రవారం కొందరు అనుచరులను సంప్రదించిన ఎస్సీవీ శనివారం మరింత మందితో సమావేశం అవుతున్నారని చెబుతున్నారు. శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే సత్రవాడముని రామయ్య, సత్యవేడు మాజీ ఎమ్మెల్యే హేమలత, ఆమె కుమార్తె హెలెన్‌లను ఈ సమావేశానికి ఆహ్వానించినట్టు సోషల్ మీడియాలో పేర్కొ న్నారు. తెలుగుదేశం అభ్యర్థుల పట్ల అసంతృప్తితో ఉన్న వీరు నేడు ఎటువంటి నిర్ణయం తీసుకుంటారో అనే ఆసక్తి అందరిలో ఉంది.

ఎన్నికల విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు

బుచ్చినాయుడుకండ్రిగ, మార్చి 15: ఎన్నికల విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ మహ్మద్ ఆలీఖాన్ హెచ్చరించారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో ఎన్నికల కసరత్తుపై ఎస్ఐతో, బీఎల్వోలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలింగ్ బూత్‌లలో వసతులను పూర్తిస్థాయిలో కల్పిం చాలని సూచించారు. ఎస్ఐ వెంకటనరసింహ మాట్లాడుతూ గ్రామా లలో ఎటువంటి గొడవలు జరగకుండా పటిష్ఠ చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ చంద్రబాబునాయుడు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్

కేసుల వివరాల కోసం అభ్యర్థన

శ్రీకాళహస్తి, మార్చి 15: పెండింగ్ కేసుల వివరాలను అందజేయాలంటూ శ్రీకాళహస్తి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జల సుధీర్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా ఎస్పీకి లిఖితపూర్వకంగా విజ్ఞప్తి చేశారు. తాను వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా నామినేషన్ వేసేందుకు పెండింగ్ కేసుల వివరాలు ఇవ్వాలని ఆయన కోరారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ఇద్దరి అరెస్టు

తొట్టంబేడు, మార్చి 15: శ్రీకాళహస్తి మండలంలోని నాయుడుపేట- పూతలపట్టు జాతీయ రహదారిపై చెర్లోపల్లి వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా మద్యం సేవించి వాహనం నడుపుతున్న ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. శ్రీకాళహస్తి రూరల్ సీఐ అజయ్ కేసు నమోదు చేశారు.

కట్ట పుట్టాలమ్మకు మొక్కులు చెల్లించిన టీడీపీ



రేణిగుంట, మార్చి 15: బొజ్జల సుధీర్‌రెడ్డికి శ్రీకాళహస్తి ఎమ్మెల్యే టికెట్ కేటాయించడంతో టీడీపీ నాయకులు శుక్రవారం కరకంబాడి పంచాయతీ పరిధిలోని కట్టపుట్టాలమ్మ ఆలయం వద్ద 101 కొబ్బరికాయలు కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బుజ్జినాయుడు, సుబ్రహ్మణ్యంరెడ్డి, రాజేంద్ర, మునిరాజా, చలం పాల్గొన్నారు.

ఎర్రగుట్ట గుడిసె వాసులకు పట్టాలివ్వాలి



నిరసన తెలుపుతున్న ఇళ్ల పోరాట సమితి

రేణిగుంట, మార్చి 15: ఎర్రగుట్ట గుడిసె వాసులను అర్హులుగా గుర్తించి వారికి పట్టాలివ్వాలని ఇళ్ల పోరాట సమితి కార్యదర్శి సత్యశ్రీ కోరారు. శుక్రవారం స్థానిక తహసీల్దారు కార్యాలయం వద్ద ఇళ్ల పోరాట సమితి ఆధ్వర్యంలో నిరసన తెలియజేశారు.